
ఆంధ్రమహిళ



Andhra Mahila April 1963-50 nP



ఆంధ్ర మహిళ

సంపుటి 19 ఏప్రిల్ 63 సంచిక 4

విషయసూచిక

ముఖచిత్రం : కీ. శే. రాజెన్‌బాబు

కవిత 2

సంపాదకీయం 3

తెలిసిన నిజం (పెద్ద కథ) -
శ్రీమతి చివుకుల సుబ్బలక్ష్మి 4

సింధునది (వ్యాసం) -
శ్రీమతి వారణాసి యశోదాదేవి 9

రేడియో మహిళా మండలి 15

చిల్డ్రన్స్‌గార్డెన్ స్కూలు 16

ఆంధ్ర చిత్రకళ -
శ్రీ యమ్. నరసింహాచార్య 17

మలుపు (కథానిక) -
శ్రీమతి రూపాబాయ్ మోతిలాల్ 21

శారద లేఖలు -
శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ 28

మబ్బులోని పొద్దు (సీరియల్) -
శ్రీమతి గుళ్లపల్లి సుందరమ్మ ... 30

కాలాతీతం (కవిత) -
శ్రీమతి యస్. యస్. ప్రసూన ... 38

చెకోస్లొవాకియాలో మహిళా సంఘాలు
హోనా కోజెల్‌కోవా ... 39

ఆంధ్ర మహిళ

7 ఎ, రోజరీ చర్చిరోడ్, శాంథోమ్ మద్రాసు-4

చలిరాత్రి

చలిలో ఒకరాత్రిలో
చల్లని ఒకరాత్రిలో

మల్లిపందిరి నీడలో
మలయమారుతంలో
మంచువర్షం జల్లులో
మాట్లాడక కూర్చున్నా!

శరీరంపై మంచువర్షం
శరీరమంతా చలి అధీనం
కరుడు గట్టే భయం కల్గె!
కాశ్మీర్ శాలువ జ్ఞప్తికొచ్చె!

చాకలిచేతుల్లో పడ్డాక
చాలాసార్లు అడిగినను
అతడు తెచ్చియివ్వలేదు!
అవసరాలుండు నందరికీ!

ప్రొద్దుట ట్రంకునుండి తీసిన
స్వెట్టర్ జ్ఞప్తికొచ్చింది!
చెదపురుగుల బృందం దాన్ని
విందుగా ఆరగించింది!

పచ్చగా నా ఎదుటనున్న
పొన్నచెట్టు కన్పించింది!
ఆ సమయములోన
ఆమె నాలో మెదిలింది!

నా ప్రక్కనుచేరి మెల్లగా
నా తలను నిమురుతూ

ఆనందంగా మాట్లాడే
ఆమె అందమైన ముఖం
మెదిలింది నామదిలో!
మెరిసింది నాకళ్ళలో!

కళ్ళలోని తీయనికల
కరిగిపోయిందింతలో!
వేడి నిట్టూర్పులపుడు
వెలువడ్డాయ్ మదిలో!

తీయని సంఘటనలు
తీపిరుచి చూపిస్తాయ్!
కాని కష్టదినాల్లోన
కఠినశిక్ష నిస్తాయ్!

సుఖా లనుభవించుట
కష్టా లనుభవించుటకే!
కష్టా లనుభవించిన
సుఖాల ప్రసక్తుండదు!

[రాబిన్‌షా "పుష్ప" గారి ఒక హిందీ కవిత ఆధారంగా]

— భాస్కరశ్రీ

ఆంధ్రమహిళ

వ్యవస్థాపకురాలు : దుర్గాబాయి దేశ్‌ముఖ్

సంపుటి 19 :: ఏప్రెల్ 1963 :: సంచిక 4

రాజర్షి రాజెన్‌బాబు

రాజర్షి రాజెన్‌బాబు ఒక తారకయై వినువీధిని జేరడంతో గాంధీజీతరం ముగిసిందనవచ్చు. ఈ జీవనరంగమొక కర్మభూమిగా భావిస్తూ, ఈ జీవితమొక ధర్మవేదికగా తలపోస్తూ, తమ బ్రతుకు బాటలో సేవానికుంజపు పుష్పపరిమళాలు వెదజల్లిన మహనీయుల కోవకి జెందుతాడు రాజన్‌బాబు. అమర బాపూజీ సమ్మోహనాస్త్రానికి కట్టుబడి, భారత స్వాతంత్ర్యం కొరకై జరిపిన అహింసా సమరంలో, అతిరథ మహారథశ్రేష్టులలో ఒకనిగా తేజరిల్లి, తన దేశమాత దాస్యశృంఖల విముక్తయైన పిమ్మట, భారత రాజ్యాంగ సభాధ్యక్షునిగా, ఆ తరువాత రాష్ట్రపతిగా, భారత ప్రజాహృదయ రమాపతిగా, అన్ని మతాలవారికీ, అన్ని పక్షాలవారికీ ప్రేమపాత్రుడైనాడు ఈ పుణ్యమూర్తి.


రాజన్‌బాబు సతీమణి రాజబన్సీదేవి పోయిన సెప్టెంబరులో పరమపదించింది - మన ప్రాచీన సంప్రదాయ ప్రకారం అన్నట్లు భర్తకంటె ఆరునెలలుముందు వెళ్లిపోయింది. ఈయన రాష్ట్రపతి పదవీవిరమణచేశాక, పాట్నాలోని సదాకత్ ఆశ్రమంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ ఆశ్రమంనుంచే మనస్వాతంత్ర్యానికి పూర్వం, భారతీయ విద్యాపీఠాన్ని నిర్వహించారు బాబూ రాజేంద్రప్రసాద్.

మితభాషీ, విజ్ఞానఖనీ అయిన రాజెన్‌బాబు మృదుహాసంలో దయారసం వెన్నెల సోనలై కురిసేది. ఆయనవంటి నిరాడంబరజీవి, త్యాగధనుడూ, సేవాధర్మమే జీవితచుక్కానిగా అమర్చుకొన్న మత జీవనుడూ మరొకరు కానరారు. మహాత్ముని సిద్ధాంతాలూ ఆశయాలూ మనసావాచా ఆచరణలో పెట్టిన ధన్యజీవి రాజెన్‌బాబు.

"ధైర్యంతో మసులుకో- కాని భగవంతుని స్పర్శ మరువకు. ఆయన నీకని నిర్దేశించిన పాత్రని ఉచితరీతిని నెరవేర్చు." తులసీ రామాయణంలోని ఆ పలుకులు రాజెన్‌బాబు గదిలో ఉండేవట. ఆయన తన యిహలోకయాత్రని అక్షరాలా ఆ విధంగా సాగించి, దివ్యత్వం పొంది, ఆదర్శజ్యోతియై వెలుగొందుతున్నారు.

— మాలతీ చందూర్

గౌరవ సంపాదకులు



★

తెలిసిన నిజం

★

అప్పుడే ఐదైపోయిందే. ఆయనొచ్చే వేళయిందే

ఇంకా ఈ వంట కాలేదే అని విసుక్కుంటూ మధ్యాహ్నం మూడింటినుంచీ వంటపనితో సతమతమౌతూ వంటసామానుతో కుస్తీపడుతున్న పద్మ ఆ హడావుడిలో చారులో తిరగమోతవెయ్యబోయి పోపుగరిటీ కాస్తా పక్కనున్న మంచినీళ్ళ బిందెలో పడేసింది. చెయ్యి లోపలకంటా వెడితే కాని తను చేసిన పొరపాటు గ్రహింపుకు రాలేదు. బిందెడు మంచినీళ్ళూ ఎందుకూ పనికిరాకుండా పోయాయి. మళ్ళీ తెల్లవారి బండివాడు నీళ్ళుతెచ్చేదాకా ఈ నీళ్ళే శరణ్యం. ఎలాగా అనుకుంటూ దిగులుపడి మంచినీళ్ళ బిందె కేసిచూస్తో కూర్చుంది, కుంపటిమీద చారు పొంగి పొయిలోపడి గుప్పున పొగ చుట్టుముట్టి చప్పగా నిప్పు చల్లారిపోయింది, రెండో కుంపటికూడా నేనూ ఆరిపోతున్న అంటూ ఆ ఉన్న కాసిని నిప్పులూ నివురుగప్పుకున్నాయి. పద్మకి తన అవస్త తలుచుకుంటుంటే ఏడుపొస్తోంది. ఎందుకు తన మీద అందరికీ ఈ కక్ష. తనేం పాపంచేసిందనీ ఈ శిక్ష. హాయిగా మావగారు వంటమనిషిని పంపిస్తానంటే వద్దని అత్తగారు వాదించింది, తనకి అంత బాగా వంట రాదు. ఎరినైనా అడిగి చేద్దామంటే అంగడికోటీ ఆపద కొకటీ అన్నట్టు ఆ కేంపులోఉన్నవే పదిహేను ఇళ్ళు. ఇంజనీరుదగ్గర్నుంచీ మేస్త్రీదాకా అంతా ఆ పదిహేను ఇళ్ళల్లోనే సద్దుకున్నారు. అయినా అంతా తలో కులం వారు, అందరిదీ తలావకభాషా అటువంటప్పుడు ఎవర్ని అడుగుతుంది. ఏమని అడుగుతుంది. పోనీ వారేనా చేస్తారనుకుంటే పెట్టింది తినడం పెట్టకపోతే మానెయ్యడం తప్ప పెళ్ళైవచ్చిన ఈ పదిహేను రోజులనుంచీ భార్యా భర్తల మధ్య మాటల్లేవు. కనీసం ఒక ఇంట్లో మనుషుల్లా కాకపోయినా స్నేహితుల్లా అయినా తమ మధ్య సంబంధంలేదు. దారిపోయే ప్రయాణీకుల్లా తటస్తంగా ఎవరిపనులు వాళ్ళు లేచిందిమొదలూ పడుకోబోయేదాకా నిర్వహించుకుంటూ కాలంగడిపేస్తున్నరా ఇంట్లో. భర్త భోంచేసి వెళ్ళాక తను తింటే కానీ ఆ పదార్థాల రుచి పద్మకి తెలియదు. తిన్ననాడు తిని లేని నాడు లేక, ఏమీ చేతకాక భోరున ఏడుస్తూ కూర్చుంటుంది. ఏదెలాఉన్నా ఇంటికి రాగానే గ్లాసుడు మంచి నీళ్ళిద్దామన్న లేకుండా బిందెడు నీళ్ళూ ఎందుకూ పనికి రాకుండా పోయాయి. నూనెజిడ్డూ, పోపువాసనా. ఆ చుట్టుపక్కల ఐదారుమైళ్ళదాకా చూపుకి అందినంత మేరలో నీళ్ళ చుక్కలేదు ఆ తుంగభద్రనుంచీ నీరు

రావలసిందే. మెల్లగా నిక్కినీలిగి ఒక్కొక్క ఇంటికీ తెచ్చి పోసి తమ ఇంటికి వచ్చేసరికి తొమ్మిదవుతుంది. అంతదాకా నీటిని అపురూపంగా దాచుకోవాలి. ఇంకా మిగిలినవాటిలో పట్టిన నీళ్ళున్నాయి, అవి తాగ బుద్ధి కాదు. ఒకరికివ్వ బుద్ధికాదు. పోనీ ఎవరింట్లోంచైనా తెప్పిద్దామంటే అసలే బ్రాహ్మణ పుట్టుకపుట్టి ఆ తురక వాడు తెచ్చిన నీళ్ళు తాగుతున్నానే అని సగం మధనపడుతూ. ఎలాగో ఓలా గంగా భవానేనే అని సద్దుకు తాగుతున్న తను ఇంకా ఆ మిగిలిన ఇళ్ళల్లో వాడుకు మిగిలిన నీళ్ళు తెప్పించి తాగగలదా? ఏం చెయ్యను అని ఆలోచిస్తూ, తన నిస్సహాయతకు తనలో తనే కుమిలి కుమిలి ఏడుస్తూ పిచ్చిదాన్లా ఒక్కతే కూర్చుంది ఆ వంటింట్లో. ఎదురుగా ఆరిపోయిన కుంపట్లూ, పక్కని పోపునీళ్ళతోఉన్న మంచినీళ్ళ బిందే వెక్కిరిస్తున్నట్లున్నాయి. పద్మకి ఎంత ఆపుకుందామన్నా దుఃఖం ఆగటం లేదు.

"అయ్య బట్టలు తెచ్చేను." అంటూ వీధిలోంచి చాకలివాడి పిలుపు వినబడి ఆ ఆ వస్తున్న అని సమాధానమిచ్చి మెల్లిగా లేచి కళ్ళు తుడుచుకు నరకంతోసమానంగా భావించుకుంటున్న ఆ వంటింటికి గొళ్ళెంపడేసి అక్కడ్నుంచి ఇవతలకొచ్చింది. వీధి తలుపు తెరిచేసరికల్లా ఎదురుగా ఆఫీస్ జవాన్ కొండయ్య విలబడి.

"అమ్మ అయ్యగారు ఎవరోవస్తే వారితో పనిమీద రాయచూరెళ్ళారు. వస్తే ఎనిమిదింటికి వస్తారు. లేకపోతే సినీమాచూసి రాత్రి ఒంటిగంటకి వస్తారండి. అంతదాకా నన్నుండమన్నరు." అంటూ చేతులుకట్టుకు స్వామి భక్తి ప్రదర్శిస్తూ నిలబడ్డాడు.

అ మాట వింటూనే చాకలి "అయ్యో. ఇంకా గుడ్డలిచ్చి డబ్బులట్టుకెడతాం అనుకున్ననే. అయ్యగారిప్పుడు రారన్నమాట'' అంటూ వాడి నిరాశని తెలియజేస్తూ చేతిలో మూట కిందపెట్టి ఒక్కొక్క బట్టే వేటికవి ఎర్పరచడం మొదలెట్టేడు.

"సరేలే కొండయ్యా, త్వరగా భోంచేసిరా'' అని కొండయ్యకి చెప్పి లోపలకి వెళ్ళి పద్దు పుస్తకంతెచ్చి ఒక్కొక్క బట్టే పద్దుచెప్పడం మొదలెట్టింది పద్మ.

బట్టలన్నీ పద్దుచూసేక ''అన్నిమూటకట్టెయ్య చాకలీ రేపురాబట్టలకి" అంది.

''వద్దమ్మా మూటకడితే నలుగుతాయి. పెట్టెలో పెట్టెయ్యండమ్మ అయ్యగారుంటే ఎంటనే పెట్టేసీవోరు" అంటూ ఎవరి బట్టలు వారికి వేరుచేసి తుండు దులిపి బుజాన్నేసుకు? "పోనీండమ్మ. మీదగ్గిరుంటే ఇప్పిద్దురూ. రాయచూరుకి లారీ పోతోంది, నేనూ పోయి సరుకులు తెచ్చుకుంటానమ్మా'' అంటూ వినయంగా నిలబడ్డాడు.

పద్మ లేచి లోపలికెళ్ళి డ్రాయరు సొరుగు లాగి చూసింది. ఏదో కొద్ది చిల్లరా రెండు మూడు రూపాయి కాగితాలూ తప్ప ఏమీలేవందులో లోపల్నుంచే ఎంత చాకలీ అంది ఇంతవరకూ భర్త చాకలికి డబ్బియ్యగా తను చూడలేదు. ఎంతో తెలియదు.

"ఆదేంటమ్మ మీకు తెలిదా? మీరు రాకముందు అయిదూమీ రొచ్చేక పదీ" అన్నడు చాకలి, ఆ చిల్లర అందులోనే పడేసి తిన్నగా తన పెట్టెదగ్గరకి వెళ్లి పదిరూపాయల కాగితం తీసి వాడిచేతిలో పెట్టి వాడిని సాగనంపి తలుపుదగ్గరగా వేసి లోపలకి వచ్చింది.

ముందుగా తన బట్టలు తనపెట్టిలో పెట్టేసింది. భర్త మధు బట్టలుతీసుకెళ్ళి పెట్టిముందు కూర్చుంది. పెట్టిమీద చెయ్యి వెయ్యబోయేసరికి పాము పుట్టమీద చేయివెయ్యబోతూంటే కలిగేటటువంటి గగుర్పాటూ భయం కలిగేయి. చేతులు వణుకుతున్నాయి. ఆ బట్టలు నువ్వు పెట్టిలో పెట్టకపోతేనేం అని తన్నెవరో నిలదీసి అడుగుతున్నంత భయం కలిగింది. ఒక్కసారిగా భయంతో వెనక్కి కూలింది. ఏం పెడితే తప్పా అతను నీ భర్త అని అంతరాత్మ ధైర్యంచెబుతూ ప్రోత్సహించినట్లనిపించింది.

అవును. అవును వారు నాభర్త, అందుకే ఈ వెట్టిచాకిరీ. ఏనాడైతే నామెళ్లో ఆ మూడు ముళ్ళూ వేశారో ఆనాటినుంచీ వారు నాభర్తే. నేను వారికి భార్యని. అందుకేగా నా ఈ రాక. లేకపోతే వారెవరో నేనెవరో. పెట్టిలో బట్టలు పెట్టడంతప్పా వండిపెట్టడంలేదూ. అను

శ్రీమతి చివుకుల సుబ్బలక్ష్మి



నృత్య నాటికలకు తెరవెనుక అలంకరణ.
చిల్డ్రన్స్ గార్డెన్ స్కూలు పిల్లలు,

కుని తన ఊహాకి తానే నవ్వుకుంటూ మెల్లిగా పెట్టెమీద చేయివేసి మూత తెరవబోయింది.

“వద్దు పద్మా నీవా బట్టలు పెట్టెలో పెట్టడానికి వీల్లేదు. వచ్చిన పదిహేను రోజుల్నుంచీ లేని దొరక అతను ఇంట్లోలేనప్పుడా దొంగతనంగా పెట్టె చూస్తుంటావు? అక్కర్లేదు. అలా ఉంచెయ్యి. తరవాత అతనువచ్చి పెట్టుకుంటాడు నీవెందుకే” అని తన్ని ఎవరో భయపెట్టి హెచ్చరిస్తున్నట్లనిపించింది పద్మకి. ఎత్తబోయిన మూత అలాగే వదిలి అబ్బా-అంటూ రెండుచేతులతోటీ తల పట్టుకుంది బాధగా.

పిచ్చిదానా ఎందుకాభయం పెట్టెలో బట్టలు పెడితే పట్టుకు కొడతాడా? అంత పిరికితనం పనికిరాదమ్మ లే త్వరగా కానియ్యి. అని తన్ని ఎవరో బ్రతిమాలుతూ ప్రోత్సహిస్తున్నట్లనిపించి గుండె చిక్కబట్టుకు పెట్టె మూత ఎత్తబోయింది పైకి.

పద్మా చెపితే వినవే సరే నీ ఇష్టం. అని ఎవరో గట్టిగా గద్దించి పలికినట్లయింది. అంతలోనే మళ్ళీ పిచ్చి పిల్లా ఆ పెట్టె మూత తీసిచూసి నువ్వు భరించగలవా? అందుకేనా యీ హెచ్చరిక. జాగ్రత్త అవన్నీ చూసి నిగ్రహించుకోగలశక్తి ఉంటేనే తియ్యి, ఏ పరిస్థితి లోనూ మనస్థైర్యం మాత్రం కోల్పోవద్దు. జాగ్రత్త. జాగ్రత్త అంటూ పదే పదే చెప్పినట్లయి. అబ్బా ఎందుకీబాధ. ఒక్కసారిగా పీక పిసికి చంపిపారెయ్యక ఎందుకీ రంపపు కోత అనుకుని ఏమైనా సరే ఆ పెట్టె తీసిచూసి తీరవలసిందే. అని తనకి తాను ధైర్యంచెప్పుకు మెల్లిగా రెండుచేతులతోటీ పెట్టె మూత పైకెత్తింది. చూస్తే అది బట్టలపెట్టా, పుస్తకాలపెట్టా అన్న అనుమానం కలిగింది. ఓ పక్కగా నాలుగు పేంట్లు, ఇంకోపక్క నాలుగు పుస్తకాలు పత్రికలూ వాటి మధ్యన మడతలువిడిన లుంగీలూ, తువ్వాళ్ళు, బనీను లూ, ఇంకా కాస్త పక్కకి జరిపిచూస్తే విడి, విడిగా

చిల్లర రూపాయలూ, అందులో, అందులోనే చోటు చేసుకు సగం, సగం పిచ్చిగా గీసిన బొమ్మలూ. అసంపూర్తిగా రాసినదే పదిసార్లు రాస్తూ నింపిన కధలూ, వ్యాసాలూ, ఒకటేమిటి వీటన్నిటినీ పరచుకు బుష్‌కోట్లు, పెళ్ళిసూట్లతోసహా ఒక్కమాటతో చెప్పాలంటే పెళ్ళి కొచ్చిన ఫ్లాస్కుదగ్గర్నుంచీ ఎలక్ట్రిక్ హీటరూ, టేబిల్‌లైటూ, టాయిలెట్‌బాక్సుతో సహా ఓ సంసారమంతా అందులోనే ఇమిడిఉంది. మేమూఉన్నాం అంటూ ఓ చిన్న బొజ్జింకపిల్లా, రెండు చిమ్మటలూ అందులోనే స్థిరనివాసం ఏర్పరుచుకున్నయి. పద్మకి పెట్టి చూస్తుంటే మతిపోతోంది ఒక్కొక్కటే ఇవతలకి తీస్తుంటే మధ్యలో అత్తగారు రాసిన ఉత్తరం కళ్ళబడింది. తీసి చదవబోయింది. ఛా – ఇతరులకొచ్చిన ఉత్తరం తను చదవోచ్చా అనుకుంటూ దాన్ని పక్కకి నెట్టి మెల్లిగా పెట్టెఅంతా ఖాళీచేసింది. ఆఖర్న అట్టతీసి దులపబోయేసరికి దాంట్లోంచీ ఏవేవో ఉత్తరాలూ, ఒక చిన్నసైజు ఫోటో రఫ్‌గా రాసిన ఒకకథ కిందపడ్డాయి. మెల్లగా ఫోటోతీసి చూసింది, అందులో రకరకాల వ్యక్తులున్నారు. అందులో తన భర్తకూడా ఉన్నారు. ఫోటో అనగా తమ ప్రతిరూపం చూసుకోడానికి నానా అవస్థలు పడి ఎన్ని పోజులిస్తూ నిలబడతారో ఆ ఫోటో లోని వ్యక్తుల్ని చూస్తోంటే తెలుస్తోంది, మధ్యగా తన భర్త మాత్రం ఠీవీగా నిండైన విగ్రహంతో హుందాగా ఫుల్‌సూటుతో నిలబడ్డారు. ప్రక్కఉన్న స్త్రీ నేనేనా తక్కువ అన్నట్టు మరింత ఆకర్షణీయంగాఉంది. చేతిలో ఫోటో పక్కకిపెట్టి కథా కాగితాలు అందుకుంది. మడత విప్పిచూసేసరికి, పైన హెడ్డింగ్‌లో "విధి బలీయం" అన్న పేరూ ప్రక్కనే బ్రాకెట్‌లో ఒక జీవిత సత్యం. చిన్న కథ అనీ రాసుంది, పై పేరు చదవగానే ఎందుకో పద్మకి తల తిరిగింది.

* * *

"అవునమ్మ చీకట్లో ఒకరూ దీపమేనా లేకుండా ఉన్నారేం అమ్మ. ఈ చుట్టుపక్కల చిరుతలు తిరుగుతుంటాయని చెప్పేగా. పెందరాళే దీపం పెట్టి తలుపులు వేసేసుకవాలి. నేనిందాకానేఒద్దామనుకున్నను ఈ రోజు మా ఇంటిది కూడొండడం ఆలేశమైంది. ఇదుగో ఈ దీపం గదిలో పెట్టుకండి. నే నిలా తలుపులు తీసుకు ఈ గుమ్మంలోనే కూచుంటాను" అంటూ దీపాలు వెలిగించి జేగంటలా గుమ్మానికో దీపం వేలాడేసి టేబిల్ లైటు వెలిగించి గది గుమ్మంలో పెట్టి తాపీగా చుట్ట ముట్టించి ముందు గుమ్మంలో బైటా ఇంచేడు కొండయ్య.

పద్మ కొండయ్య వెలిగించిన లైటు సహాయంతో గబగబా తనకి తోచినట్టూ బట్టలు సద్దేసి అత్తగారు రాసిన ఉత్తరమూ, భర్త రాసిన కథా చేతబట్టుకు డ్రాయరు సమీపించింది. ఎదురుగా డ్రాయరుమీద అలారం టైంపీస్ ఏడూ అంటూ గంటలు చూపించింది. అప్పటికే ఆ గదినిండా చీకటి నీడలు నిండుకున్నయి. లైటు తీసుకొచ్చి డ్రాయర్‌పై పెట్టి పక్కనున్న కుర్చీ లాక్కుని కుర్చీలో కూర్చుని చేతిలో కాగితాలు టేబిల్‌పై పరచింది. ముందుగా అత్తగారు రాసిన ఉత్తరం తప్పని అంతరాత్మ హెచ్చరిస్తున్నా వినక చదవడం మొదలెట్టింది.

చి॥ మధుకి మీ అమ్మ పుత్రపౌత్రాభివృద్ధిగా దీవించి వ్రాయునది.—

మధూ నీదగ్గర్నుంచి ఉత్తరం వచ్చి పదిరోజులు దాటింది ఇంచుమించుగా అసలు నీవు ఆవూరు వెళ్ళేక రాయనట్టేలెక్క క్షేమంగా చేరాం అని తప్ప మళ్ళీ రాశావా? నీ మౌనం చూస్తోంటే నాకేదో భయంగాఉంది. అమ్మకిచ్చిన మాట మర్చిపోయావా? నిలబెట్టుకుందుకు ప్రయత్నించు. మనం మానవులం అనుకునేవి ఒకటీ జరిగేది వేరొకటీ మానవ జీవితాలికి తథ్యం. చి॥ సౌ॥ పద్మ కులాసా అని తలుస్తాను. పద్మ చిన్నపిల్ల, అన్నెంపున్నెం ఎరుగదు. పోనీ నీకు వీలుకాకపోతే పద్మనేనా వాళ్ళింటికీ, మనింటికీ రాయమని చెప్పు, దూరంలోఉన్నారు పద్మమాత్రం మనసు విప్పి ఎవరికి చెపుతుంది. ఏవనిచెపుతుంది వంటమనిషిని పంపుతే మీకు వండిపెడుతుంది, కానీ, ఇంతకన్న కన్నతల్లిని ఏం చెప్పగలను. మధూ ఒక్క మాట, అరోజు నువ్వేం అన్నావో గుర్తుందా? కట్టుకున్న తరువాత భార్యకి అన్యాయం చేసేటంత నీచుడు కాదమ్మ నీ కొడుకు అన్నావు. మా మధు మంచివాడు. అందుకే మళ్ళీ నీకోసారి జ్ఞాపకంచేస్తున్నాను. ఈ ఉత్తరం పద్మకి చూపించకేం. పసిమనసు గాయపడితే తట్టుకోలేదు. అలా అని నీవు ముసిలివాడవేంకావు. పద్మ కంటే పెద్దవాడివీ ఇంకా కొత్త లోకానుభవం కలవాడివీను. అందుకే ఇంత విపులంగా కన్నతల్లిగా నీకు రాస్తున్నాను. ఇక మీ నాన్నగారు సరేసరి. మళ్ళీ ఏదో కొత్త వ్యాపారం మొదలెట్టబోతున్నారు. ఉత్తరాలు రాస్తూంటావుకదూ. మీ ఉభయులకూ ఆశీర్వాదాలతో

మీ అమ్మ.

(ముగింపు పై సంచికలో)

ANDHRA MAHILA SABHA NURSING HOME

REPORT FOR FEBRUARY 1963

OUT PATIENT DEPARTMENT :—

Total Number of new patients treated	...	1186
" " " old " "	...	1749

IN— PATIENT DEPARTMENT :—

Normal Delivery	...	93
Abnormal Delivery-Manual removal of placento/Forceps	..	10
Medical and Surgical cases treated	...	21
Post-Natal and Ante-Natal and Gyneac cases	...	57
Babies admitted as Lodgers	...	104

FAMILY PLANNING :—

Persons contacted	...	862
Clinic attendance	...	450
Persons visited at Home	...	720
Sterilization cases	...	14
Group meetings held	...	71

ORTHOPAEDIC CENTRE

Patients attendance	...	43
Cases treated		
i) polio	...	28
ii) Cerebral Palsy	...	15
iii) Deformities	...	1



★ సింధు ★

గంగ, యమున, సరస్వతి పుణ్యానదులు సంస్కృతీ నిలయములై, దైవతములై నారాధింపబడుచున్నవి. సింధు విశిష్టత అనశ్వరము. భరత వర్షమైన మన దేశమునకు హిందూదేశ మనునన్వర్థ నామధేయమును బ్రసాదించినది సింధునదమే, భరత ఖండము ఆ సేతు సీతాచలము పర్యంతము సింధు మాత రూపమే. హిందు, హైందవములకు, యిండియా, యిండియనులకు-యీ పదజాలమునకు మూలకందము సింధువే. సింధు సంస్కృతి, సరస్వతీ నాగరికత అదియే ఆర్య సంస్కృతికంటె బహు ప్రాచీనమైనది.

1947 సం॥లో భారత విభజనవలన సింధు లోయ, సింధు రాష్ట్రము పాకిస్థానములో జేరినప్పటికిని, యివి భారతీయ సంస్కృతీ వాహినులకు గంగా, యమునా, సరస్వతీ లోయలవలె పెన్నిధానమై యున్నది.

సింధువు అనగా సముద్రము; సాగరమువలె మహా ప్రవాహమై గంభీరముగ నున్నందున యీ నదమును వేదకాలమునుండియు సింధువని వచించియుందురు. పద ప్రారంభమున 'స' వుచ్ఛరించుట కష్టసాధ్యమైనందున పారశీకులు 'సింధు'ను 'హిందు' యనిరి. పర్షియానుండి 'హిందు'

పదము గ్రీసు దేశమునకు వ్యాపించగా, గ్రీకులు ఆ పశ్చిమ నదము పేరున దేశమునంతను 'యిండియా' అనిరి. మహమ్మదీయుల దండయాత్రలతో పారశీకము 'హిందు' హిందు స్థానము, హైందవులు – యీ రూపములలో మన దేశమునకు తిరిగి వచ్చినది.

భారతభూమి యందలి నదీమండలముల బట్టి భారతీయ సంస్కృతిని చతుర్విభాగములుగ విభజింపవచ్చును. 1. సింధులోయ 2. గంగాలోయ 3. దక్కను పీఠభూమి. 4. దక్షిణ దేశము రహదారులుగను. నీటి సరాఫరాకును ఆయువు పట్టులైన జీవస్రవంతుల పరిసరములే సంస్కృతి కేంద్రములయ్యెను గదా.

నైసర్గికముగ సింధునదము హిమాలయములలో కాశ్మీరపు పశ్చిమప్రాంతమున లడక్ పర్వతములలో శతధృ గోగ్రానదుల జన్మస్థలములకు కతిపయదూరమున నొక గ్లేసియరునందు జన్మించి తనమార్గమును కోసికొనుచు వాయువ్యముగ బ్రవహించును. కొంతవడిబోయి రెండుప్రవాహములు గలిసిన వేరొక బ్రవాహమును గల్పుకొని జోజిలామార్గము. బల్తాల్ గ్రామసమీపమునుండి స్వల్పవాహినుల గల్పుకొనుచు కైలాసపర్వతపంక్తినంటియే లడక్ ద్వారా వాయవ్యముగ బ్రవహించుచు త్రోవలో సోనామార్గ్ పీఠము లేపట్నము, కులూత్ జాయి, కర్తాష్కోపురము సమీపమునుండిబోవును. పర్వతపంక్తి దాటగనే కారకోరం పర్వతముల దక్షిణభాగము నుండి వచ్చు షియాకునది సింధులో సంగమించుచున్నది. కాబట్టి సింధుయిచ్చట కొంత పెద్ద ప్రవాహముగుచున్నది.

షియాకు సంగమమునుండి కొన్ని వంపులు దిరిగి అది సింధువు వాయవ్యముననే బ్రవహించును. స్కార్డో గ్రామము సమీపించుసరికి మరియొకనది వుత్తరము నుండి వేగముగవచ్చి సింధునుగలియుచున్నది. కొండూరు పురము దాటి కొంతదూరమేగి నది నైరుతికి మరలి, గిల్గిట్ నుండి యేతెంచునొక పెద్దప్రవాహమును గల్పుకొని బుంజీదరుదు పురముల పార్శ్వమున కొన్ని మెలికెలుగ బ్రవహించుచు పశ్చిమ వాహినియై కాశ్మీరదేశపు పశ్చిమసరిహద్దుజేరి వెంటనే దక్షిణమునకు మరలి కొంత ప్రవహించి తిరుగ నైరుతిదెసకు మరలి హిందూదేశపు పశ్చిమమోత్తర సరిహద్దు పర్గణాలలోనికి వచ్చుచున్నది. అచట కొన్ని వాహినుల గల్పుకొని దక్షిణవాహినియైనిన వుదఖండము దాటి, యటక్పట్టణముంజేరి, యచట (సువస్తస్వాత్,) కుభా (కాబూలు) నదులు గలిసిన కాబూలు నదిని గల్పుకొని దక్షిణముననే బోవుచు పాంచాలదేశము ప్రవహించును.

పంజాబు (పాంచాలము) లో వితస్థా (జీలమ్), చంద్రభాగ (అశక్ని లేక చీనాబ్) లో చేరి యింతవరకు దాదాపు 500 మైళ్లు వాయవ్యముగ బ్రవహించిన సింధు దక్షిణమునకు బ్రవహించును, అంతట శతధృ, విపాశా (బియాస్) నదులు తమ సవన సమీపమున సంగమించి బ్రవహించుచు నైరుతి దెశకు బోయి వితస్థ ఐరావతి, అశక్ని నదుల బ్రవాహములతో గలిసి పంచనదుల జలములుగలిసిన ప్రవాహము కొంత దక్షిణమునకు బోయి సింధులో గలియుచున్నది. ఈ పంచనదులు సింధులో గలియుపర్యంతము సిం

శ్రీమతి వారణాసి యశోదాదేవి

ధుకు ఆదిసింధువని పేరు. సంగమ స్థానమునుండి సింధువని పేరున్నను పంచనదమను వాడుక ప్రబలమై యున్నది. ఇచటి సింధు కడు విస్తృతమై యగాధమై, గంభీరమై యుండును. ఈ తీరున ఆరోర్పురము దనుకపోవుసరికి పంచనదంబగు సింధుకు వాడుకనామము మారి"మిహ్రాన్" యన బడుచు సక్కారు, బుకూరులనడుమనుండి ప్రవహించుచున్నది; పూర్వపు శివిస్థానమును, ప్రస్తుతపు సింధు హైదరాబాదు, ప్రాచీన పాటల ములదాటి కరాచి సమీపమునుండి ఆగ్నేయ ముగ నున్న తన డెల్టాలముఖముగ పలుశాఖలై పశ్చిమ (అరేబియా) సంద్రమున సంగమించుచున్నది.

సింధునది పొడవు 1800 మైళ్లు; ఇది పియా కునుగలియు పర్యంతము మార్గము మనోహర మైన పచ్చిక బయళ్లు, చిత్రవిచిత్రమైన పూవుల పొదలు గల్గియుండును. కాని మనుష్య నివాసము స్వల్పము. 370000 మైళ్లప్రదేశపు వర్షపాతమును ప్రవహింప జేయుట, సింధునది బహువిస్తృమై మహాసాగరమువలె నుండును. సింధూరాష్ట్రి మున సుక్కూరు సమీపమున దీని కడ్డముగ Barrage కట్టి నీటిని వ్యవసాయమున కుపయోగించు గొప్ప పనులుగలవు. పూర్వము సింధు నదము శాఖయొకటి Cutch కి బోవుచుండెను. కాని 200 స॥ ల క్రితము అది భూమిలో గలిసి పోయెను.

మాళవదేశమందలి కాళీ సింధునది దక్షిణ సింధువని మహా భారతములో ప్రశంసింప బడి యున్నది. కాళిదాసు మేఘ సందేశములో వర్ణించిన సింధునది కాళీ సింధుకు సరిపోవుచున్నది. మత్స్యపురాణ మందును యీ నది ప్రశంస గలదు. ఇదికాక రాజఘురుసంస్థానములో శిలోంజను తావున జన్మించిన వుత్తరవాహినియై జలాన్పురముకడ యమునలో సంగమించు నొక సింధు నది గలదు. ఇది పూర్వసింధువని మాలతీ మాధవములో జెప్పబడినది. ఈ నదీ ప్రశంస దేవీ పురాణమందునుగలదు.

భరతదేశమంతటికి పుణ్యానదులు సప్తసింధువులు- గంగా యమునానదులువేరు; ఇవికాక సింధునదము, వుపనదులు జేరి సప్తసింధువులన బడుచున్నవి. ఇవి- ఐరావతి (రవి), చంద్రభాగ (చీనాబ్), వితర్ధ (జీలమ్,) విపాశ (బియస్,) శతధృ (సెట్లెజ్,) సింధు ఆదిసింధువు, సరస్వతి (కాబూల్ నది, కుంభనది) నదులు. వీనిలో ఆరు నదులు నాది సింధువులో సంగమించుట వలన సింధునది యగుచున్నది. మొదటి పంచనదుల ప్రవాహములచే సస్యశ్యామలమైనదే పంజాబు. ఋగ్వేదమందు బేర్కొనబడియున్న సుసర్తునది సింధునదిలో గలియుచున్నది. రావినదిలో సంగమించు దేవానది (డీగో) మైనాక పర్వతములో జన్మించి ముల్తాను ప్రక్కగా ప్రవహించుచున్నది. సెట్లెజ్ నదికి పూర్వము హైమవతి యను పేరుండెనట. ఇందు వసిష్ట మహాముని తీర్థమాడ బోవనది నూరుపాయలయ్యెనట; అంత ఋషి శతధ్రూ అనెనట. రావినదియు హైమవతి యన బడు చుండెనని వరిత్స్య పురాణములో గలదు; పాంచాలములోని ఐరావతికి సైతమీ పేరుండెనట. ఋషి కుల్యకు తొల్లింటి పేరు హైమావతి యని హేమకోశములో గలదు. సెట్లెజ్‌నది, సరస్వతి, ఘగ్గరునదులతో సంగమించి హక్రా నదియై భావల్పూరు మెడాగులలో ప్రవహించుచు 18 వ శ॥ లో యింకిపోయెను. సింధులో గలియుటవలన గావలయు సరస్వతినది సింధు మాతయని బిల్వబడియున్నది.

సింధును చేరకముందే యంత ర్వాహినియై నందువల్ల గానోపు సరస్వతి నదిరూపము విస్మృత మైనది. సింధు యటులకాదు; చారిత్రకముగ సింధు ప్రాముఖ్యత యద్వితీయమైనది. సింధు లోయను గంగాలోయను రాజపుత్ర స్థానపు Thar ఎడారి విభజించుచున్నది. కురుక్షేత్రము

రెంటిని గలుపుచున్నది. క్రీ. పూ. 3000 సం॥ల ప్రాంతమున యీజిప్టులో నైలు నదీ తీరమందును, మెసపొటేమియాలో Euphrates నదీ పరిసరములందును, మనదేశమున సింధుతీరమందును మహోన్నతమైన నాగరికత సింధులోయలో– సిమ్లా కొండలనుండి కథియవారు వరకు– వుత్తరమునుండి దక్షిణమునకు– 950మైళ్ల విస్తృత పర్యంతము వ్యాపించెను; మరియు షుమారు సహస్ర వర్షముల కాలము–క్రీ. పూ 2500 నుండి 1500 వరకు నీ సంస్కృతి విజృంభించెను. పంజాబులో రావీనది వామ పార్శ్వమున నున్న హరప్ప, సింధు ముఖద్వార మునకు 250 మైళ్లు యెగువనున్నదీ దక్షిణమున నున్న మహంజదారో, యివి రెండునుగాక, సెట్లెజ్ నదికి పైభాగమున నున్న రూపరునుండి కిథియవాడులోని రంగపూరువరకు గల ప్రదేశ ములో మూడుపురములు, యనేక గ్రామములం దలి శిధిలములు, జంతువుల బొమ్మలు, బొమ్మల రచనలు గల ముద్రికలు సింధు సంస్కృతియం దలి ఐక్యతాగుణము గమనింపదగి యున్నది. ఒకే ప్రమాణము, ఆకారముగల యిటుకలు శిధిలములందు బయలుపడినవి. శిధిలపట్టణము లలో మతసంబంధమైన కార్యములకు, రాచవిష యములకు వసతిగ పశ్చిమముగ వున్నతమైన ప్రదేశముండెను. దానికి క్రిందుగ పురముండెను. దీని విస్తృతి ఒక చదరపుమైలు, ముఖ్యమైన వీధులు కొన్ని. 30 అడుగుల వెడల్పుగల్గి సూటిగ నిర్మితమై పట్నమును కొన్ని ఖండ ములు జేయుచుండెను, యీ ఖండములలో చిన్నచిన్న వీధులుండెను. గృహములలో కొన్ని రెండులేక మూడు అంతస్థులు గల్గియుండెను; కాని అన్ని గృహములకు Plan ఒక్కటిగనే యుండెను. ఒక చదరముగనున్న ఆవరణము చుట్టు కొన్ని గదులుండెను; మార్గములు ప్రక్క తెరువులలోన కుండెను. వీధివైపు గవాక్షములు లేవు. అభ్యంగనపు కొట్టములు, drainage వుండెను. సామాన్య గృహముల క్రింది అంతిష్థు వైశాల్యము 30 అడుగుల చదరము. కార్మికుల గృహములు రెండుగదులుగల్గి వరుసలుగ నుండెను.

మహంజొదారోలో230'×78' వైశాల్యము గలనొక దివ్యభవనము ముండెను. హరప్పలో Citadel కు వుత్తరమున ధాన్యపుగాదె 150'×200' కొలతలు గల సమతలముపై నిర్మింప బడెను; ఇది 50'×20' కొలతలుగల భాగము లుగ జేయబడెను. ఇందు రైతులు ప్రభుత్వ మునకు పన్నుగ కొల్చియిచ్చిన ధాన్యము భద్ర పరుపబడుచుండెను. ఈ కాలమున విదేశములతో వాణిజ్యము, వ్యాపారము విరివిగ సాగుచుండెను. సింధుసంస్కృతి సింధుముఖ ద్వారమువరకును విస్తృతమై యున్నప్పటికిని, సింధుప్రజలు సముద్రమును లక్ష్యపెట్టినటుల దోపదు. సముద్ర మార్గమునగాని, నేలదారుల వల్లగాని, సింధు ప్రజల వస్తువులు మెసపొటేమియా జేరు చుండెను. ఇక్కాలమున వ్యాపార, వాణిజ్య కుటుంబములు తమ నామధేయములను, మత చిహ్నములనుగల ముద్రికలు గల్గియుండెను. వీరి ముద్రికలు యెన్నో మెసపొటేమియాలో లభ్య మైనవి. హరప్ప చిన్నెలు గల్గియున్న మెస పొటేమియను ముద్రికలు మహంజోదారోలో లభించినవి. ఇంతవరకు లభ్యమైన సింధుముద్రికలు (Seals) రెండువేలు; వీనిని ప్రజలు తాయెత్తుల వలె ధరించుచుండిరట.

సింధుప్రజల భాషకు వర్ణములు 270 మాత్రమే ఇవి చిత్రములవలె నుండును. మహంజొదారోలో Citadel మీద బ్రహ్మాండమైన నీటితొట్టె గలదు. దాని వైశాల్యము 39×23 అడుగులు. దానిచుట్టు Cloister గలదు, దానివెనుక గదులు వుండెను మహోన్నతమైన భవననిర్మాణ మందుకంటె చిన్నచిన్న వస్తునిర్మాణమందు సింధుప్రజల నైపుణ్యము గోచరించుచున్నది, ఉదా:– జంతువులు, ఆటబండ్లు, నర్తకి; శక్తి.

పశుపతి ప్రతిమలు, రాగి, కంచుతో చేయబడిన పనిముట్లు. జనుల దుస్తులు ధరించుచుండిరి; స్త్రీలు వివిధములైన కేశ బంధములను, ఆభరణములను నలంకరించుకొనుచుండిరి; శక్తి, పశుపతి, నంది యారాధింప బడుచుండెను.

పంచనదములకు దక్షిణము నందును, సింధు నదికి వుభయ తీరములందును సింధురాష్ట్రము గలదు. మహాభారతకాలపు సింధులేక సైంధవ దేశమిదియే. దీని రాజైన సైంధవుడు దుర్యోధనుని సోదరియైన దుస్సలాదేవి భర్త. అభిమన్యుడు పద్మవ్యూహమును భేదించుకొని మరలివచ్చుచున్న సమయమున నడ్డుతగిలి వాని మరణమునకు గారకుడయ్యెను. ఈనాటికి సర్వసంసిద్ధమైన కార్యమున కెవరేని యడ్డు దవిలి కార్యభంగము జేసిన వానిని 'సైంధవలడ్డు' యనుట వాడుక, క్రీ. శ. మొదటి శతాబ్దములలో సింధుదేశమును, ఆలోర్, బ్రాహ్మణా బాదులు రాజధానులుగ బౌద్ధమత మవలంబించిన రాజవంశము బాలించెను. పూర్వపు ఆరోరు పట్నము ఆది సింధునది దక్షిణభాగమున రోహ్రి పట్టణము (షికార్పూరుజిల్లా)నకు నాగ్నేయముగ నైదుమైళ్ల దూరమున నిపుడు కుగ్రామమై యున్నది. ఇచట ఆనాటి కాళికాదేవి ఆలయమును, బుగ్గిని పంచదారగ మార్చిన భక్తుడు షేక్పదు దున్నా సమాధియుగలవు.

హిందూదేశమున ముస్లిములకు వశమైనది సింధుదేశమే. క్రీ.శ. 711 నుండి మూడు శతాబ్దములు సింధురాష్ట్రము అరబ్బుల పాలనక్రింద ఖలీఫాలకు యధీనమైయుండెను. క్రీ. శ. 7 సం॥ లో ఖలీఫా సేనాని కాశీం సింధు ముఖద్వారమార్గమున సింధు దేశమును బ్రవేశించెను. గజనీమహమ్మదు సింధురాష్ట్రమును జయించెను. గాని రాజపుత్రవంశీకులై మహమ్మదీయమత మవలంబించిన **Sumras, Sammas** అను రాజవంశములు స్వతంత్రముగ భావించెను. 18వ శ॥ వరకు ముఖ్యరేవుపట్టణమైన తట్టా **Sammas** రాజులకు రాజధానిగనుండెను.

వీరి తదనంతరము సింధురాష్ట్రములో రాజ్యమేలిన అర్ఘున్ రాజులు విదేశీయులు; వీరికి తర్వాత **Turkhan** రాజవంశము పాలించెను. సింధులో వుమ్రకోటలో జన్మించిన అక్బరు చక్రవర్తి సిందురాష్ట్రమును మొగలు సామ్రాజ్యంతర్గతభాగము జేసెను. ఔరంగజేబు మరణానంతరము కల్హొరులు, హైదరాబాదు రాజధానిగ 'మీరు' బిరుదు వహించి పాలించిన తల్పూరు రాజులు పాలించిరి. వీరితో సంప్రతింపులు, ఘర్షణలు పడి ఆంగ్లేయులు క్రీ. శ. 1758 సం॥ లో తట్టాలో యీస్టు యిండియా కంపెనీతరపున ఫాక్టరీ కట్టిరి. క్రీ. శ 1838 సం॥ లో ఆఫగనుస్థానముపై దండయాత్రకు బ్రిటిషుసైన్యములు సింధు మార్గమున నెళ్లెను క్రీ. శ. 1842 సం॥ నకు పిమ్మట సింధురాష్ట్రమును కంపెనీవారు వశముచేసికొనిరి. కమిషనర్ల పాలనక్రింద రాష్ట్రము యభివృద్ధిజెందెను.

శిబికుమారుడైన సౌవీరుడు పాలించినది సింధుసౌవీర దేశము. దీనిని ఆల్వెరూని మూలస్థాన ప్రాంత దేశమనెను. రాజధాని సౌవీర పురమునుండి మిత్రసు రాజుదత్త మిత్రుడని పేరుగల్గి నాపేరున దత్తమిత్ర పురమనెను. నవారణ్యములలో సైంధవారణ్యము గలదు. ఇక్ష్వాకు సంతతిలో సూర్యవంశ క్షత్రియుడైన రాజుపేరు సింధుద్వీపుడు. భారద్వాజ వుపగణములో సింధవ, సింధుగోత్రములుగలవు.

అలగ్జాండరు దండయాత్ర కాలమున సింధులోయలోని జీలమ్ చీనాబ్ నదులమధ్య దేశమును పౌరవచక్రవర్తులును, రావి చీనాకి నదుల మధ్యభూమిని మాళవ క్షుద్రక రాజులును పాలించు చుండిరి. ఔత్తరాహులలో సింధీయులను ఒక తెగవారుగలరు. ఇవ్విధముగ సింధునదీ శోభగ ప్రతిమానమై గానవచ్చుచున్నది. ★

హైదరాబాదు రేడియో మహిళల మండలి

హైద్రాబాద్ రేడియో మహిళామండలి ఫిబ్రవరి పదవతేదీన, శ్రీమతి నీలంనాగరత్నం సంజీవరెడ్డి అధ్యక్షతన సమావేశమై, దేశరక్షణ నిధికి రెండవతడవ బంగారమూ, ధనమూ విరాళంగా సమర్పించారు.

ఫిబ్రవరి పదవతేదీ సాయంత్రం నాలుగున్నర గంటలకి దివ్యజ్ఞాన సమాజపుహాలులో - ఆంధ్ర మహిళాసభ విద్యార్థినుల ప్రార్థన గీతంతో ఈ సమావేశము ఆరంభమయినది. శ్రీమతి పుతలీ బాయ్ సభికులకి ఆహ్వానం తెలిపారు. రేడియో మహిళామండలి కార్యదర్శిని శ్రీమతి. కె. సుగుణమణి, యీ మండలి కార్యకలాపాలని సమీక్షించారు. 1962 డిశంబరు నెలలో యీ రేడియో మహిళామండలి సభికురాండ్రు 1451 రూ. నగదురూపంలోనూ, 224. గ్రాముల బంగారం ఆభరణాల రూపంలోనూ జాతీయ రక్షణనిధికి విరాళంగా సమర్పించారు. రెండవ తడవ 744 రూపాయలూ, 30 గ్రాముల బంగారమూ, యివిగాక ఆరు బంగారు వుంగరాలు సమర్పించారు ఈ మండలి. విరాళాన్ని శ్రీమతి నీలం నాగరత్నం సంజీవరెడ్డి అందుకొన్నారు. ఈ సమావేశంలో లోక్ సభ సభ్యురాలు శ్రీమతి సంగం లక్ష్మీబాయమ్మ మాట్లాడుతూ, స్త్రీలు ప్రస్తుత పరిస్థితులలో ప్రముఖపాత్ర నిర్వహించాల్సి వుందన్నారు. ఆహార పదార్థాల ధరలు పెరిగిపోకుండా చూడటం స్త్రీల బాధ్యత అనీ ఈ విషయంలో ప్రభుత్వంతో స్త్రీలు సహకరించి, దేశక్షేమానికై పాటు బడాలనీ అన్నారు.

శ్రీమతి పొన్నమ్మా కరియప్ప - బంగారపు ఆవశ్యకతని గురించి విశదీకరించారు. స్త్రీలు బంగారు ఆభరణాలపై మోజు వదులుకొని ఆయుధాలకై తమ ఆభరణాలని విరాళంగా యివ్వాలని కోరారు. శ్రీమతి సుజాతా బాసిరెడ్డి యింటింటా పెరటితోటలు, కూరగాయలూ పెంచవలెనన్నారు. ఈ కూరగాయల పెంపకంతో - గృహిణిలు నిత్యవ్యయాన్ని కొంత తగ్గించగలరనీ, దేశరక్షణకి ప్రతినయాపైసా ఈనాడు అత్యంత అవసరమై వున్నదనీ తెలిపారు.

శ్రీమతి. టి. చంద్రమతీదేవి, దేశరక్షణ విషయంలో స్త్రీల పవిత్రబాధ్యతని గురించి మరోసారి జ్ఞప్తిచేశారు. స్త్రీ వీరమాతగా, వీరపత్నిగా తన పవిత్రబాధ్యత నెరవేర్చాలన్నారు. రేడియో అక్కయ్య - పూరూరావున్న మహిళామండలిలూ, స్త్రీల సంస్థలూ దేశరక్షణకై నిరంతరం కృషిచేస్తూ విరాళాలని పంపాలని కోరారు. మండలి కార్యదర్శిని శ్రీమతి సుగుణమణి వందన సమర్పణతో ఆనాటి సమావేశం ముగిసింది.

★

ఆంధ్ర మహిళా ప్రెస్ వారు
ఉడుతాభక్తిని
జాతీయ రక్షణ నిధికి
ఈ నెల సమర్పించిన
ఒకరోజు వేతనం రు 44-86

చిల్డ్రన్స్ గార్డెన్ స్కూలు రజతోత్సవాలు

మార్చినెల 7, 8, 10, 16 తేదీలలో మద్రాసులోని చిల్డ్రన్ గార్డెన్ స్కూలు రజతోత్సవం జరుపుకుంది. మైలాపూర్‌లో వున్న యీ స్కూలు - మా ఆంధ్రమహిళాసభకి చిరకాల మిత్రురాలు అత్యంత సన్నిహితమైనదీని. ఇంచుమించు మా ఆంధ్రమహిళాసభ సంస్థతోపాటే ద్వారకాకాలనీలోనే ఈ స్కూలుకూడా స్థాపించబడినది. ఏడెనిమిది నెలల తేడాలో మాకుమల్లే నే యీ స్కూలుకూడా సిల్వర్ జూబ్లీ జరుపుకున్నది

తొలిరోజున యీ రజతోత్సవ సభలని రామకృష్ణామఠానికి చెందిన శ్రీ కైలాసనంద స్వామిజీ ప్రారంభోత్సవం చేశారు. మద్రాసువిశ్వవిద్యాలయపు వుపాధ్యక్షులూ, ప్రముఖవిద్యావేత్తా శ్రీ లక్ష్మణస్వామి మొదలియారు అధ్యక్షత వహించారు ఇరవై అయిదు జ్యోతులను వెలిగించి యీ కార్యక్రమాలని వుపక్రమించారు.

మరునాడు మైలాపూరులోని రసికరంజని సభలో విద్యార్థి విద్యార్థినులు నాటకాలు, పాటలు,నృత్యములు మొదలగునవి ప్రదర్శించారు ఆనాటి ప్రదర్శనకి మద్రాసు ఆర్థికవిద్యామంత్రి శ్రీభక్తవత్సలం అధ్యక్షత వహించారు. మూడవనాడు మైలాపూరులోని స్కూలు ఆవరణలో స్ప్రింగ్ ఫెస్టివల్స్ జరిగాయి. మూడవనాటి ఈ వుత్సవాలు యీస్కూలు పాతవిద్యార్థుల ఆధ్వర్యాన నడపబడినాయి. షుమారు పాతిక రకాల ఆటలూ, లకీ డిప్, మాజిక్, చేతిపనుల ప్రదర్శనా మున్నగునవి ఆనాడు నిర్వహించారు.

మార్చి పదహారవతేదీ యీ స్కూలుకి అనుబంధంగా వున్న బృందావన్ హాస్టల్ రజతోత్సవం జరిగింది. ఆనాటి ప్రదర్శనలో హాస్టలుపిల్లలు పాల్గొన్నారు. ఈ ప్రదర్శనకు మద్రాసు మంత్రి శ్రీ రామయ్య అధ్యక్షత వహించారు. నాలుగు రోజులపాటుజరిగిన రజతోత్సవాలకి పలు ప్రాంతాలనుండి పాతవిద్యార్థులనుంచి, సందేశాలూ శుభాకాంక్షలూ వచ్చినాయి. ఎందరో తొలిరోజులనాటి విద్యార్థులు యీ నాడు తండ్రులై, తల్లులై ప్రస్తుతం విద్యార్థులైన తమపిల్లలతోపాటు యీవుత్సవాలలో పాల్గొనడం అభినందించదగిన విషయం. ఈరజతోత్సవాల సందర్భాన ప్రచురించిన స్కూలు సావనీర్‌లో తెలుగు, ఇంగ్లీషు, తమిళభాషలలోవ్యాసాలూ చిన్నచిన్న పాటలూ, పద్యాలూ, క్విజ్‌లూ మున్నగునవి వున్నాయి. ఇవిగాక యీ స్కూలు స్వీయచరిత్రని కూడా క్లుప్తంగా వివరించారు వ్యవస్థాపకులైన శ్రీశర్మా దంపతులు.

★

ఆంధ్ర చిత్రకళ



భారతీయ సంస్కృతి సభ్యతల నిర్మాణము కోసూ భారతీయ సాహిత్యకళల క్రమ వికాసంకోసూ ఆంధ్రులు ప్రముఖ పాత్రని నిర్వహించారన్నది నిర్వివాదాంశం. ముఖ్యంగా భారతీయ శిల్ప చిత్ర కళా రంగాలలో ఆంధ్రుల ప్రభావం ఎంతేనా కనిపిస్తుంది. అజంతా, ఎల్లోరా, అమరావతి, నాగార్జునకొండ, లేపాక్షి మొదలైన దివ్య కళాకేంద్రాలు ఈ సత్యాన్ని మనకి నిరూపిస్తున్నాయి

గత అర్ధ శతాబ్దినుండి భారతీయ చిత్ర కళా రంగంలో పొడసూపిన నూతన చైతన్యానికి ఆంధ్ర చిత్రకారులు దోహదంచేశారు. పాశ్చాత్య ప్రాచ్య

కళా సమన్వయోద్యమంలో ఆంధ్ర చిత్రకారులు ముందంజ వేశారు.

ప్రాచీన భారతీయ శిల్ప చిత్రకళా చరిత్రకి అజంతా గుహలు ఆధార స్తంభాలంటే అతిశయోక్తి కాదు. ఈ గుహల నిర్మాణం క్రీస్తుకి మూడు శతాబ్దాల పూర్వమే ప్రారంభమైంది. అజంతాలో స్థాపత్య శిల్ప చిత్రకళల పవిత్ర త్రివేణీ సంగమం మనకి సాక్షాత్కరిస్తుంది. ఈ అజంతా కళ వెయ్యి సంవత్సరాల వరకూ సక్రమ వికాసం చెందుతూవచ్చింది, క్రీస్తు శకం ఏడవ శతాబ్దాంతానికి అది బాగా వికసించి సమస్త విశ్వానికి ఒక దివ్య కళాకేంద్రంగా రూపొందింది. అజంతా అద్వితీయ భారతీయ శిల్ప చిత్రకళా కేంద్రమవడమే కాక ఆంధ్ర కళాకారుల ప్రతిభకి ఉజ్వలమైన ఒక ఉదాహరణగా అది నేడు ప్రపంచంముందు నిలచి ఉంది.

అజంతా మహా కళాకేంద్రం. సంపూర్ణ భారత దేశానికి స్ఫూర్తిదాయకంగా ఉంటూ క్రమక్రమంగా దేశ రాజకీయ సాంఘిక మత విషయిక పరిస్థితులను బట్టి మారుతూవచ్చింది. బౌద్ధమత ప్రాబల్యంతోబాటు అజంతా శిల్ప చిత్రకళలు సమగ్ర వికాసాన్ని పొందాయి. ఈ వికాసక్రమంలో రాజపుత్ర మొగలాయీల శాసన కాలాలలో వారివారి అభిరుచుల ననుసరించి మార్పులు జరుగుతూ వచ్చాయి. క్రీస్తుశకం ఏడవ శతాబ్దంనుండి పదిహేడవ శతాబ్దంవరకు కళా రంగంలో ఈ ఉత్థాన పతనాలు దాగుడుమూతలాడుతూనే ఉన్నాయి.

రాజపుత్ర మొగలాయీ చిత్రకళా శైలులకి ఆంధ్ర చిత్రకళా విధానమే స్ఫూర్తి స్రోతస్సని చరిత్రకారుల కథనము. ఈ పేర్కొన్న ఉత్థాన పతనాల పోటుపాటులు సుమారు వెయ్యి సంవత్సరాలవరకూ నడిచాయి. ఆ తరువాత భారతీయ చిత్ర కళాకాశంలో ఒక్కసారిగా అంధకారం ఆక్రమించుకుంది. ఈ అంధకార యుగం సుమారు రెండువందల సంవత్సరాలు భారతీయ చిత్రకళా చరిత్రని పరిపూర్ణంగా తన ఆవరణచే కప్పివేసింది.

పంతొమ్మిదవ శతాబ్దారంభంలో మళ్ళీ దక్షిణంలోనే క్రొత్త చైతన్యం పొడసూపింది. ఆ అంధకారమయ కళాయుగం యొక్క ఆఖరిక్షణంలో తిరువితాంకూరుకి చెందిన శ్రీ రవివర్మ కళతో భారతీయ చిత్రకళా రంగంలో ప్రవేశించాడు.

రవివర్మ భారతీయ చిత్రకళా పరంపరనీ దాని ఆదర్శాలనీ సరిగా అవగతం చేసుకోలేదు. అయితే అతని హృదయంలో భారతీయ సంస్కృతి సభ్యతల యెడల ఒకవిధమైన శ్రద్ధలేకపోలేదు. ఒక సామాన్య ఆంగ్ల చిత్రకారుని శిష్యుడగుటవలన అతడు ఆ శ్రద్ధను పరిమార్జితం చేసుకోడంలోనూ దాన్ని తన రచనలలో వ్యక్తపరచడంలోనూ అసఫలుడయాడనే అనాలి. అప్పటికే దేశంలో కళ యొక్క అసలురూపం పూర్తిగా రూపు మాసిపోయిఉండడంవల్ల రవివర్మ చిత్రకళ సామాన్య ప్రజల్లోనూ ఉన్నత వర్గాలలోనూ ఒకవిధమైన అభిరుచిని కలుగజేసింది. రవివర్మ చిత్రాలు దేశమంతటా మారుమ్రోగాయి. దీనివల్ల కలిగిన ఉపకారమేమంటే ప్రజలలో చాలాకాలంగా సుప్తావస్థలోనున్న కళాభిరుచికి ఒకవిధమైన దోహదం కలగడమే. ముఖ్యంగా చారిత్రిక పౌరాణిక చిత్రాలవైపు ప్రజల దృష్టి ఆకృష్టమైంది.

ఇది స్తబ్దతకీ చైతన్యానికీ యుగసంధి సమయమనచ్చు. ఈ సమయంలోనే ఇ. బి. హావెల్ మహోదయుడు భారతదేశం రావడం, మొదట మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్సులోనూ, తరువాత కలకత్తా స్కూల్ ఆఫ్ ఆర్ట్సులోనూ ప్రధానాచార్య పదవిని నిర్వహించడం జరిగింది. ఆ కాలంనాటి అపభ్రంశ కళని ప్రతిఘటిస్తూ అసలైన భారతీయ చిత్రకళవైపు ప్రజల దృష్టి నాకర్షించేందుకు హావెల్ మహోదయుడు ఎంతో సహాయపడ్డాడు. ఆయన ప్రయత్నాలవల్లనే కలకత్తాలో శ్రీ అవనీంద్రనాథ ఠాకూర్ నేతృత్వంలో భారతీయ కళాపునరుద్ధరణోద్యమం బయలుదేరి యావద్భారత దేశంలోనూ నవీన కళా చైతన్యం కలుగడానికి పీఠికైంది. ఈ ఉద్యమంలోకూడ ఆంధ్రులు ముందంజవేసిఉండడం ముదావహం.

శ్రీ ఎమ్. నరసింహాచార్య

ఇరవైయ్యో శతాబ్దారంభంలో కలిగిన ఈ నవ్య కళోద్యమానికి అజంతా చిత్రకళ దోహదమిచ్చింది. కజిన్సు, హావెల్, కూల్డ్రే మొదలైన కొందరు పాశ్చాత్య కళావేత్తలూ, అవనీంద్రనాథ ఠాకూర్, ఛటర్జీ, దేవీ ప్రసాదరాయి చౌధరి, రోమేంద్రనాథ చక్రవర్తి మొదలైన కొందరు వంగ చిత్రకారులు ఆధునిక ఆంధ్ర చిత్రకారుల కళా సృజనకి ఆదర్శ ప్రాయులు అయారన్న సంగతి గమనించతగ్గది. ఆంధ్రుల అజంతా కళవల్ల ప్రభావితులై వంగ చిత్రకారులు అవలంబించిన కళారీతిని ఆంధ్రులు సోత్సాహంగా స్వీకరించి దానికి ఒక ప్రత్యేక ఆంధ్ర రూపాన్ని ఇవ్వగలిగారు.

ఈ భారతీయ చిత్రకళా పునరుద్ధరణోద్యమంలో ఒకవంక అడవి బాపిరాజు, గుర్రం మల్లయ్య, తేజోమూర్తుల కేశవరావు, కౌతా ఆనంద మోహనశాస్త్రి, కౌతా రామమోహనశాస్త్రి, వి. ఆర్. చిత్ర, మాధవ పెద్ది గోఖలే మొదలైన చిత్రకారులు తమ మంజుల భావనాపూర్ణ కళాసృజనంలో అగ్రసరులైతే, ఇంకొక వంక దామెర్ల రామారావు, చామకూర భాష్యకార్య రావు, చామకూర సత్యనారాయణ, వరదా వెంకటరత్నం మొదలైన చిత్రకారులు తమ రచనాశైలిలో పశ్చిమీ ప్రాచ్యకళా రీతుల మేళవించడంద్వారా ఒక విశిష్ట కళాశైలిని అనుసరించడానికి యత్నించారు.

కీర్తిశేషులైన దామెర్ల రామారావు ఆంధ్ర చిత్రకారుల్లో ఒక విశిష్ట స్థానాన్ని ఆక్రమించుకున్నారు. ఆధునిక ఆంధ్ర చిత్రకళకి ఆయన ఒకవిధంగా ప్రవర్తకులని చెప్పాలి. ఆంధ్ర సంస్కృతి సభ్యతల వ్యక్తపరచే అనేక సున్నిత విషయాలు ఆయన కళాహృదయంలో పరిష్కృతాలై ఆయన చిత్రాల్లో సాక్షాత్కరించాయి. ఆయన చిత్రాలు ఆంధ్రుల ఆచార వ్యవహారాలకీ వేషభాషలకీ సాంఘిక సాంప్రదాయాలకీ అనుగుణమైన మధుర భావాలతో తొణికిసలాడుతాయి, ఆయన అకాల మరణంతో ఆంధ్ర చిత్రకళకి తీరని నష్టంకలిగిందని వేరే చెప్పక్కర్లేదు.

ఆధునిక ఆంధ్ర చిత్రకళని పునరుద్ధరించి దానికొక విశిష్ట వ్యాపకరూపం ఇచ్చిన శ్రేయం కీర్తిశేషులు అడవి బాపిరాజుకి దక్కుతుంది. కళకి సంబంధించిన వీరి ఉత్కృష్ట అభిప్రాయాలూ ఉన్నత ఆదర్శాలూ నేటి ఆంధ్ర చిత్రకారులకి స్ఫూర్తిదాయకాలై వారిని కళాక్షేత్రంలో అగ్రసరులుగా చేస్తున్నాయి.

వీరి తరువాత పేర్కొనతగ్గవారు కీర్తిశేషులు మొక్కపాటి కృష్ణమూర్తి. అజంతా, రాజపుత్ర, మొగలు కళారీతుల ప్రభావంతో వీరి చేతుల్లో ఆధునిక ఆంధ్ర చిత్రకళ ఒక విశిష్టరూపాన్ని పొందింది. వీరి చిత్రాల్లో మానవ హృదయాల్లోని మధుర భావాలకి రూపాన్నివ్వడానికీ, స్త్రీమూర్తియొక్క సమగ్ర సౌందర్యాన్ని వ్యక్తపరచడానికీ చక్కని కృషి గోచరమౌతుంది. ఈయన ఆంధ్ర చిత్రకళలో ప్రీరాఫియలైటు దళానికి నేతృత్వం వహించారని చెప్పవచ్చు.

ఫ్రెంచి చిత్రకారుల నాయకత్వంలో తలెత్తిన బహుముఖ చిత్రకళోద్యమాల్లో పాల్గొనడంద్వారా నేటి ఆంధ్ర యువ చిత్రకారులు చిత్రకారిణులూ అభ్యుదయవాదులుగా భావించబడుతున్నారు. నేటి ఫ్రెంచి చిత్రకారులవలె కళాక్షేత్రంలో కల్లోలం కలిగించడం గాక విశిష్ట కళాసృష్టిద్వారా తమను తాము సంపూర్ణంగా వ్యక్తపరచుకోడమే నేటి మన యువ చిత్రకారుల మహదాశయం. పోస్టు ఇంప్రెషనిజం తరువాతినుండి నేటి ఫ్రెంచి కళాక్షేత్రంలో అలముకున్న కల్లోలంనుండి తమను సంపూర్ణంగా దూరంలో ఉంచుకోడమే వీరి ఆశయం. వీరి భావాలూ విషయాలూ భారతీయాలు. ఈ అభ్యుదయ కళాకారులలో సయ్యద్ అహమ్మద్, భాగేశ్వరశర్మ, పైడిరాజు, రామగోపాల్ మొదలైన చిత్రకారులు పేర్కొనదగినవారు. అభ్యుదయ చిత్రకారిణులలో శ్రీ అమృతా షెర్ గిల్, శ్రీ దేవయానీ కృష్ణ చేసిన కృషి భారతీయ చిత్రకళా క్షేత్రంలో మరువరానిది.

కీర్తిశేషులు దామెర్ల రామారావుగారి అడుగుజాడలలో నడుస్తూ ఆంధ్ర చిత్రకళకి మెచ్చుకోతగ్గ సేవచేసిన ఆంధ్రమహిళా చిత్రకారిణులు శ్రీమతి బుచ్చికృష్ణమ్మ, శ్రీమతి సత్యవాణిగార్లు. ఈ కోవకే చెంది చిత్ర కళారాధనతోబాటు శిల్పకళారాధనకూడ సాగిస్తూన్న యువ చిత్రకారిణి చామకూర అరవింద. శ్రీమతి రామగోపాల్ రచనలూ శ్రీమతి శాంత ప్రకృతి చిత్రాలుకూడ ఈ సందర్భంలో పేర్కొనదగ్గవి.

కీర్తిశేషులు అడవి బాపిరాజుగారి ఉన్నత కళాశిఖర ఛాయల్లో కళారాధన చేస్తూ చిత్రకళారంగానికి సేవచేస్తూన్న శ్రీమతి రత్నాల కమలాబాయి ఆంధ్ర చిత్రకారిణులకి ఆదర్శప్రాయులు. వీరి నటరాజ

చిత్రంలో దివ్య కళాంశులు మనం చూడగలం. ఈ రీతి చిత్రకారిణులలో శ్రీమతి నరసింహారావు పేర్కొనతగినవారు.

ఆంధ్ర చిత్రకళారంగంలో ప్రీరాఫియలైట్ దశానికి నేతృత్వం వహించిన కీర్తిశేషులు మొక్కపాటి కృష్ణమూర్తి ఛత్రఛాయల్లో ఉన్నత కళాశిఖరాల నందుకున్న కొందరు ఆధునిక ఆంధ్ర చిత్రకారిణులు నేడు కళారంగంలో పేర్కొనదగిన కృషి చేస్తున్నారు. శ్రీమతులు సీతాదేవి, విజయలక్ష్మి, స్వరాజ్యలక్ష్మి, అలివేలు మొదలైన చిత్రకారిణులు ఆంధ్ర చిత్రకళా రంగంలో ప్రముఖ స్థానం వహిస్తారు. భారతీయ చిత్రకళా సాంప్రదాయాలకి కట్టుబడుతూనే ఈ చిత్రకారిణులు తమ రచనలలో నిత్య నూతనతకి ప్రాధాన్యత నిస్తారు. శ్రీమతి సీతాదేవి చిత్రాల్లో భావగంభీరత, రేఖాసౌకుమార్యం, వర్ణలాలిత్యం చక్కగా ప్రస్ఫుటమౌతాయి. వీరి 'రాసలీలలు' ఒక ఉదాత్త చిత్రం.

నేటి ఆంధ్ర చిత్రకారిణులలో ఎక్కువమంది జానపద చిత్రకళారీతులచేత ప్రభావితులయ్యారని చెప్పాలి. తంజావూరు మధ్యయుగాన చిత్రాలు ఆంధ్ర ప్రదేశ్ లోని తోలుబొమ్మలు జానపద చిత్రకారులకి స్ఫూర్తి నిచ్చే మచ్చుతునకలు వంటివి. పల్లెటూరి చిత్రకారులు గోల్కొండ బొమ్మలూ, కొండపల్లి బొమ్మలూ, ఆట వస్తువులూ, చేతితో తయారుచేయబడిన చిన్న పెద్ద గృహోపకరణములూ, ఈ చిత్రకారిణుల రచనకి ఆధారాలు. నిత్యజీవితానికి ఉపయోగించే అన్ని వస్తువులూ కళాత్మకంగానూ సురుచిపూర్వకంగానూ ఉండాలనే ఆదర్శంతో ప్రేరితులై ఈ చిత్రకారిణులు తమ రచనల్ని సాగిస్తున్నారు.

యామినీరాయ్ నేతృత్వంలో జానపద రీతిని కళా రచన చేసే ఆంధ్ర చిత్రకారుల్లో శ్రీ పి. ఎల్. నరసింహమూర్తి, శ్రీ కే. శ్రీనివాసులు పేర్కొనతగినవారు. ఇదేమార్గంలో సక్రమగతిని అగ్రసరులవుతూన్న ఆంధ్ర యువ చిత్రకారిణి శ్రీ విజయలక్ష్మి. ఈమె చిత్రాల్లో భారతీయ కళారీతులూ జానపద చిత్రకళాశైలీ పరిపక్వత పొందాయి. ఈమె క్రొత్తగా చిత్రించిన ఒంటరి బాటసారి. మన రాష్ట్రపిత మహత్తర జీవితాన్ని చక్కగా వ్యక్తపరుస్తూ ఈ రీతి చిత్రాలకి మచ్చుతునకగా ఉంది.

ఆంధ్ర చిత్రకళారంగంలో సముచిత పాత్రని నిర్వహించే నేటి ఆంధ్రమహిళకి ఉజ్వలతర భవిష్యత్తు ఉందని మనం ఆశించవచ్చు. ★

మ లు పు



ప్రకృతి శోభ పసిడికాంతులతో మిసమిసలాడే సంధ్యా సమయం. పక్షుల కిలకిలా రావంతో పల్లె పడుచుల నవ్వులు మువ్వల నినాదంగా శబ్దించాయి. నిడుపైన బాటను పద వేగంతో హరించేస్తున్నట్లు ముందంజ వేస్తున్న వెంకన్న కన్నెలు చిందిన కిన్నెరల్లాంటి నవ్వులకు తప్పటడుగులు వేస్తు తలెత్తిచూచాడు. గోరింటిచెట్టెక్కి గోరింటాకు కోస్తున్న పడుచులు వేళాకోళంగా మాట్లాడుతూ నవ్వుకొంటున్నారు. వాళ్ళందరు తనకు తెలిసినవాళ్ళే. ప్రతిదినం చూస్తున్న ముఖాలే. కాని, వాళ్ళమధ్య చుక్కల్లో చంద్రుడులా మెరిసే కొత్త ముఖం?.... ఎవరా అమ్మాయి?.... పరీక్షగా చూచాడు వెంకన్న. అంతకు ముందా గ్రామంలో చూచినట్లేలేదు. చక్రాల్లాంటి కళ్ళలో మెరిసే దుడుకుతనం, వంపులు తిరిగిన ముంగురులు దోబూచులాడే ఎర్రటినుదురు, తళతళలాడే పసిడి బుగ్గలు, గులాబి పెదాలపై సన్నజాజులు విరిసినట్లున్న నవ్వుతో కళకళలాడుతున్న చక్కనిముఖం. ఆకారంలోనే కాకుండా అలంకరణలో కూడ క్రొత్తదనం కనుపించిందతని కండ్లకు. గాలి కదుపుకు మెల్లగా చెంపలను తాకే జుమ్‌కీలు, కచ్చితంగా మెడను పెనవేసుకున్న గజ్జెల పట్టెడ. నడినెత్తిన నాగరం, నల్లత్రాచులా దిగజారి కుచ్చులబరువుకు అటుయిటు వూగిసలాడే జడ పల్లెటూరు తీరుకు మెరుగులు దిద్దినట్లు సవరించి కట్టిన చీరకట్టులో సింగారం చిందులాడింది.

చెట్టుపై దాడిచేసిన అమ్మాయిల ఆతురతను చూచి, గోరింట రెమ్మలనైనా మిగులనిస్తారా యీకొమ్మలు? అనుకొన్న వెంకన్న, చక్కనిచుక్కలు చిందిన నవ్వులోని కైపుకో, గోరింటిపువ్వుల గుబాళింపు మత్తుకో మైమరచి బలంగానే నవ్వేశాడు. నవ్వు శబ్దంవిన్నదే తడవుగా అందరి చూపులు వింటినుండి వెలువడిన శరాల్లాగ వెంకన్నపై నాటుకొన్నాయి

"ఎవరు?"

"నవ్విం దెవరు?"

ఎందుకా నవ్వు?

"ఎవర్ని చూచి?"

"నిన్ను చూచే!" ప్రశ్నల తుంపర్లకు తాళలేక అన్నాడు వెంకన్న.

పైటచెంగును బిగించి కోపంతో, "నన్ను చూచా"? అని అడిగింది కొత్తమ్మాయి.

శ్రీమతి రూపాబాయ్ మోతిలాల్

ఆ కొత్తమ్మాయిని అలా అన్న తన అవసర బుద్ధికి నాలుక కరచుకొన్నా. మగువలకు లోకువై పోకూడదన్న ఆత్రంతో మళ్ళీ నవ్వాడు వెంకన్న

"మళ్ళా ఎందుకానవ్వు?" ముక్కుపుటాల నెగురజేస్తు బెదిరించింది.

"నవ్వితే నీకేం? నాయిష్టం నవ్వుకుంటాను."

"పిచ్చివాడివా?" అని చుక్కల్లో నెలవంకలా మెరిసిన కొత్తమ్మాయి అనే సరికి పాతమ్మాయిలు గొల్లుమని నవ్వారు.

వెంకన్నకు కోపం ముంచుకొచ్చింది. తనముందు నిలవడానికి బిడియపడే పడుచులు, రెండుమూడేళ్ళకు ముందు తన చేత మొట్టికాయలు తిన్నపిల్లలు తన్నుజూచి హేళనగా నవ్వడం... "మీకు పిచ్చేనా? అందుకే నవ్వుతున్నారా?" కసితో అన్నాడు,

"మాకేం పిచ్చిలేదు కానీ, ఆడవాళ్ళను చూచి నవ్వడం ఏమంత బాగాలేదు?"

"అందమైన ఆడపిల్లకు గయ్యాళితన మేమంత బాగాలేదు." కొత్తమ్మాయిని సూటిగా చూస్తు అన్నాడు వెంకన్న.

కోపంతో చురచురచూస్తు "నీదారిన నీవువెళ్ళు" అన్నది కొత్తమ్మాయి.

"దారి చూపించమని నిన్నడిగానా?"....

చింతచెట్టు చిగురుచూడు.

చిన్నదానిబిగువుచూడు... మిగతపాటను యీాలవేస్తు ముందుకు పోయాడు వెంకన్న.

"ఎంత గడుసుతనం!"

ఉక్రోషంలో ధ్వనించిన మాటలకు వెనుదిరిగి చూచిన వెంకన్న కొంటిగానవ్వాడు. సంధ్య వెలుగు రెప్పపాటులో అరుణవర్ణంగా మారినట్లు కొత్తమ్మాయి ముఖం ఎర్రబారింది.

★

"లక్ష్మి, కొంచెం మజ్జిగతీసుకరామ్మా!" అన్నాడు రామయ్య.

"ఆఁ, తెస్తున్నా బావా!" లోపలినుంచే మధురస్వరం వినిపించింది.

మజ్జిగ చెంబుతో వచ్చిన లక్ష్మికి తన బావపక్కనున్న మనిషిని చూచేసరికి మనస్సు కలుక్కుమన్నది. వెనక్కు వెళ్ళిపోయింది. రామయ్య పక్కనున్న మనిషికూడ తికమకపడ్డాడు.

"మరేం ఫరవాలేదు, రామ్మా!" ఆప్యాయంతో అన్నాడు రామయ్య.

బావపిలుపుతో లక్ష్మి ముందుకువచ్చింది.

"నీకే, తీసుకో వెంకన్నా!"

జంకుతూ మజ్జిగచెంబును అందుకొన్న వెంకన్నకు గోరింట ఎరుపుదనంలో వన్నెలు తీర్చుకొన్న నిడుపాటివేళ్ళు కనిపించాయి. లక్ష్మిని ఓరగా చూచాడు. అదేసమయంలో లక్ష్మికూడా చూచింది. "నీవేనా?" అన్నట్లు రెండు జంటనేత్రాలు కొంటితనంగా ప్రశ్నించుకున్నాయి. మెరుపుతీగలా లోపలికి వెళ్ళింది లక్ష్మి. లక్ష్మి వెళ్ళినవైపే చూస్తున్నాడు వెంకన్న.

"మజ్జిగ తాగు."

రామయ్య మాటలకు ఉలిక్కిపడ్డవెంకన్న సిగ్గుతో మజ్జిగ తాగినాడు.

"మామరదలు వస్తుందని ముందె చెప్పాను కదూ. లక్ష్మికి చిన్నప్పుడే తల్లిపోయింది. అమ్మమ్మ దగ్గర గారాబంతో పట్నవాసంలో పెరిగింది. మా అత్తపోయిన అయిదేళ్ళకు యిప్పుడు రావడం. లక్ష్మిని విడచి క్షణంవుండలేదా ముసలి ప్రాణం. పల్లెటూర్లో యివ్వడానికి అమ్మమ్మకు యిష్టంలేదు. అక్కాచెల్లెళ్ళు ఒకేవూర్లో ఒకరికొకరు సాయంగా వుంటారన్నఆశతో వొప్పుకుంది. నీ అభిప్రాయంచెప్పితే...." వెంకన్నను ప్రశ్నార్థకంగా చూచాడు రామయ్య.

"నా అభిప్రాయానికేంగాని..."

"ఇంకెవరి అభిప్రాయం?"

"లక్ష్మి అభిప్రాయం!"

"నీవు సరేనంటే దాన్ని వొప్పించేది మావంతు."

"ఎందుకైనా మీమరదలి మనస్సు తెలుసుకోవడం మంచిది." క్రిందటి సాయంకాలపు ఘటనతో లక్ష్మి తన్ను పోకిరి అని తేల్చేస్తుందేమో నన్న భయం వెంకన్నకు.

"సరే, కనుక్కుంటాను." అంటులోపలికి వెళ్ళాడు రామయ్య.

"ఏమంటావు లక్ష్మీ !"

"........."

"నిన్నే అడుగుతున్నాను."

"ఆయనేమంటాడో తెలుసుకోకుండానే!" సిగ్గుతో అన్న లక్ష్మికి, నిన్ననేగా అతనితో పేచీపడి గయ్యాళి పిల్లనుపించుకున్నది. తన్ను వద్దంటాడేమోనన్న సందేహం.

"నీకిష్టమైతే మీ బావ అతన్ని ఒప్పిస్తాడులే."

"ముందు ఆయన్నే అడగమను."

"అయితే నీకిష్టమే నన్నమాట?" అప్పుడే వంటింట్లో అడుగుబెట్టిన రామయ్య సంతోషంతో బిగ్గరగా అన్నాడు.

లక్ష్మిని వెంకన్నకివ్వడానికి రామయ్య, పార్వతి చాలా మోజుపడ్డారు. పెద్దదిక్కు లేకున్నా వెంకన్న మంచి మర్యాదగల కుటుంబంలో పుట్టిపెరిగి గౌరవంగా జీవిస్తున్నాడు. కొద్దో, గొప్పో పొలం పుట్ర, పలుకుబడీ వుంది. కాయకష్టం చేసి అభివృద్ధికి రావాలన్న పట్టుదలతో వున్న యౌవనప్రాయం. చామనఛాయతో మంచి గంభీరమైన ఆకృతిలో చూడ్డానికి బాగానేవున్నాడు. లక్ష్మి సుఖపడిపోతుందని రామయ్య దంపతులు నమ్మారు.

★

ఒక శుభదినం శుభసమయాన సర్వాలంకార భూషితయై బుగ్గచుక్కతో తనప్రక్కనున్న లక్ష్మి మెళ్ళో మూడు ముళ్లు వేశాడు వెంకన్న.

లక్ష్మి, వెంకన్నల దాంపత్య జీవితం పుష్పించిన పూలతోటలా తావి వెదజిమ్మి గుబాళించింది. ఒకరి నొకరు బాగా అర్థం చేసుకొని మసలుకోవడంవల్ల చిన్న చిన్న పేచీలకు కూడా తావు లేకుండా పోయింది. పగలంతా పొలంలో పనిచేసి అలసివచ్చే వెంకన్నను నవ్వుముఖంతో పలుకరించి వుత్సాహపరచి, తియ్యని మాటలతో, గిలిగింతలుపెట్టే నవ్వుతో ఆనందాబ్ధిలో ముంచి వుక్కిరి బిక్కిరి చేసేస్తుంది లక్ష్మి. వెంకన్న కండ్లకు లక్ష్మి అప్సరసలా కనుపించేది. లక్ష్మి అందచందాలనే గాక, ఆమె వెంకితనానిక్కి, చమత్కార ధోరణికి మురిసిపోయేవాడు వెంకన్న. అక్కయ్య బావల అండతో చీకుచింతా లేకుండా కాలాన్ని గడిపేస్తున్నది. మధ్యాన్నం చల్దన్నంతో గడిపే భర్తయింటికి వచ్చేసరికి వేడి, వేడి కూరలతో అన్నం వండిపెట్టి, బాగా ముస్తాబై గుమ్మంలో నిలుచొని వెంకన్న రాకకు ఎదురు చూస్తుంటుంది లక్ష్మి.

పొలంనుండి వస్తున్న వెంకన్నకు వీధిమొగలున రామయ్య కనుపించాడు.

"పొలంనుండి యిప్పుడే వస్తున్నావా? ఎందుకింత ఆలస్యం?" అని ప్రశ్నించాడు.

"ఇవ్వాళ కొంచెం పొద్దుపోయింది." దేన్నో దిగమింగినట్లు సమాధానమిచ్చాడు వెంకన్న. రెండు మూడు కుశల వార్తలలో ముగించుకొని రామయ్య వెళ్ళిపోయాడు.

"ఎందుకింత ఆలస్యం?" అన్న ప్రశ్నకు తాను తడబడినందుకు సిగ్గిల్లినాడు వెంకన్న. పెందరాళే యింటి ముఖం పట్టేవాడు, తనకోసం నవ్వుముఖంతో లక్ష్మి గుమ్మంలో కాచుకొని వుంటుందని తెలుసు. కాని మూడు నెలలుగా ఆలస్యంగా బాగా ప్రొద్దు గుంకిన తర్వాత యిల్లు చేరుకోక తప్పేదికాదు. కారణం తనకేనా? లక్ష్మికి కూడా బాగా తెలుసు. గృహస్థుడైన బాధ్యతతో, తనసొంతచేనన్న కాంక్షతోను బీడువారిన పొలాన్ని సాగుబడికి అనువైనట్లు చేసి బాగాపండించాలన్న ప్రయత్నాల్లో దిగినాడు వెంకన్న. దున్ని ఎరువుతోలి, చిల్లరపనులు చేసేటప్పటికి నిలువజేసిన, చిన్న మొత్తం చాల్లేదు. లక్ష్మి నిర్బంధంతో ఆమెమెడలోని గజ్జెలపట్టెడను తాకట్టు బెట్టిసాగుబడి చేశాడు. ఎదురుచూచిన దానికన్నా బాగా పచ్చగా పుష్టిగానే పైరు పెరిగింది.

నల్లపూసల సరాలక్రింద లక్ష్మిమెడ నలంకరించిన పట్టెడను పండగలోపల లక్ష్మి మెళ్ళో వేయాలన్న పట్టుదలతో అప్పు తీర్చడానికని పాలేరు తోపులో మూడు నెలలుగా పనిచేస్తున్నాడు వెంకన్న. అందుకే యింటికి మళ్ళేందుకు అంత ఆలస్యం ఇంకా రెండు నెల్లు పనిచేస్తే అప్పు తీరిపోతుంది. పండక్కి లక్ష్మి మెడలో పట్టెడ ధగధగలాడుతుంది. ఆలోచిస్తు గుమ్మంలో కాలుబెట్టేసరికి అపుడే విరిసిన పువ్వులా ఎదురైంది లక్ష్మి.

బిరబిర పొంతకుండలోని వేడినీళ్ళనుతోడి పెరట్లో పెట్టింది లక్ష్మి. వేనీళ్ళస్నానంతో బడలిక తీర్చుకుని ఒళ్ళు తుడుచుకొంటున్నాడు వెంకన్న.

"ఈవాళేం కూర చెప్పుకో?..." అన్నది భర్తను ఓరచూపులో చూస్తు.

ఆ ప్రశ్నను వెంకన్నే వేశేవాడు, కాని, యీవాళ లక్ష్మి వంతు వేసుకొంది. తనకు యిష్టమైనదేదో చేసిందని తెల్సుకొన్న వెంకన్న నవ్వుతూ "తిన్నతర్వాత చేబుతాలే," అన్నాడు.

"తిన్న తర్వాత చెప్పడం మహా గొప్పకదూ... ముందు చెప్పితేగాని వడ్డించను." చిన్నపిల్ల పంతం పట్టినట్లు అన్నదిలక్ష్మి.

"వడ్డించకపోతే నీకు మిగల్చకుండా తినేస్తాను... వంకాయల కూరేనా?"

"చింతచిగురేసి యిగరబెట్టిన వంకాయల కూర, ముద్దపప్పు, చారు...."

వెంకన్నకు నోరూరింది. "చింత చిగురేసి యిగర బెట్టావా బలే.... ఉఁ... ఆకలేస్తుంది ముందు వడ్డించు." పీటేసుకోని కూర్చోబోయాడు.

"అవసరమెందుకు?.... ముందు కొంచెం నోరు తెరు –"

ఎందుకు? అంటూనే నోరు తేరిచాడు వెంకన్న.

తన గుప్పెట్లోని దానిమ్మగింజలను భర్తనోట్లో పోసింది లక్ష్మి.

నమలుతు, "అబ్బ, ఎంతపులుపు!"... అన్నాడు. వెంకన్న.

"తీపి, పులుపు కలిసి రుచిగాలేవు?" తనచేతిలోని గింజలను వెంకన్న చేతిలో పోసింది లక్ష్మి.

లక్ష్మిని తనచేత్తో చుట్టేసి, గింజలను ఆమెనోట్లో పోశాడు వెంకన్న. కెంపుల్లాంటి దానిమ్మగింజలకన్నా ఎక్కువగానే లక్ష్మి చెక్కిళ్ళు ఎరుపెక్కినవి. అతని చేతుల్లోనుండి తన్నువిడదీసుకొంటు, "ఇంత కమ్మగా వుంటే పులుపంటావేం?" అనింది.

"పుల్లటి గింజలకే సంబరపడుతున్నావే? .... సరే కాని, దానిమ్మపళ్ళెక్కడివి?"

"బావ తెచ్చాడు"

"మీ బావేనా?"

"అవును, బావే."

"నీవు తెమ్మన్నావా?"

"అట్టే నేననలేదు, అతనే తెచ్చాడు."

"ఎందుకు తెచ్చాడు?"

లక్ష్మి సిగ్గుతో తలవంచుకున్నది.

"దినం, ఏదో ఒకటి తెచ్చిస్తున్నాడే ఎందుకు?"

"తింటానికి!"

"తింటానికని తెలుసు... నీవు అడక్కుండ ఎందుకు తెచ్చాడని?" తీక్షణంగా అన్నాడు వెంకన్న.

"ఏమో, నాకేం తెలుసు? అక్కయ్య యివ్వమనిందని చెప్పివెళ్ళాడు."

"అక్కనడిగావా పళ్ళు కొని పెట్టమని?"

"లేదే?"

"మరి?"

వెంకన్న ప్రశ్నలకు లక్ష్మి తెల్లబోయింది.

"అబద్ధాలాడకు..."

"ఇంత చిన్న విషయానికి అబద్దాలెందుకు?"

"నేను గమనిస్తునే వున్నా, వారం పది రోజులుగా దినం మీ బావ ఏవో పళ్ళుఫలాలు తెస్తునే వున్నాడు... నీ కేమన్నా కావలసి వుంటే నేను తీసుకరానా? పరాయి వాళ్ళతో చెప్పి తెప్పించుకోవడమెందుకు?" నయంగానే అన్నాడు వెంకన్న.

"మా బావ పరాయివాడా?"

"అయితే, నాకంటే నీకు మీబావే అప్తుడన్న మాట?" వెంకన్నకంఠంలో తీవ్రత ధ్వనించింది.

"ఏం మాటలివి? ఎవరైనా వింటే ఏమనుకొంటారు?"

"ఏమను కొంటారు? బావపై మరదలుకున్న మమకారానికి నవ్వుకొంటారు." రెండర్థాల్లో శబ్దించాయి మాటలు.

"ఏమన్నావు?" కోపంతో అడిగింది లక్ష్మి.

"ఏమన్నాను? బావ పరాయి వాడు కాదుగా?"

లక్ష్మికి తలతిరిగింది? వేళాకోళంగా ప్రారంభించిన వెంకన్న ధోరణి విపరీతార్థానికి దారితీసిందని గ్రహించిన లక్ష్మి కళ్లల్లో నీళ్ళుతిరిగాయి. నివ్వెరపోయి కాసేపు చిత్రప్రతిమలా నిలచింది.

"బావ యివన్ని తేకూడదా?"

"నన్ను చేతగాని వాడనుకొన్నాడా అతను? బుద్ధి వుంటేగా? "

"నామీద తప్పుంటే నన్నునుగాని, బావనెందుకు అంటావు? "

"బావనెందుకు వెనకేసుకొస్తావు? ఉఁ.... నిన్నని ప్రయోజనమేమి? నీ తళుకు మిళుకులకు మోస పోయాను."

లక్ష్మికి వొళ్ళు తెలియనంత కోపం వచ్చేసింది. "నిన్నె వరు మోసపొమ్మన్నారు? "

ఏమన్నావు?... బలమైన తన చేతినెత్తి ఆవేశంతో లక్ష్మి దగ్గరకు వెళ్ళాడు. కానీ అనుకొన్న వేగంతో లక్ష్మి చెంపను వాయించలేక ఉద్రేకాన్ని అణచుకొని వెనక్కు తగ్గినాడు వెంకన్న

అంతకుముందెప్పుడు వెంకన్న కోపాన్ని చూడని లక్ష్మి వణికిపోయింది.

"నీ మిడిసి పాటుకు ఏంచేస్తానోచూడు.... నీ బట్ట లన్నీ మూటగట్టుకో ముందు ఉఁ, కానీ...."

నెత్తురెక్కిన కళ్ళు, రోషం వురిమిన వెంకన్న ముఖాన్ని చూడలేక పోయిందిలక్ష్మి. నిలుచున్న పాళంగా వెక్కి వెక్కి ఏడ్చింది. లక్ష్మి గుడ్డలను తనే పోగుచేసి మూటకట్టి ఆమెచేతికిచ్చి గుమ్మంవైపు వేలుచూపిస్తు వీధిలోనికి నడవమన్నాడు. విస్తుపోయిన లక్ష్మి అతను చెప్పినట్లే చేసింది. ఇంటికి తాళంవేసి బయల్దేరాడు వెంకన్న.

బావ ఇంటికే తీసుకపోతున్నాడేమో ననుకొన్న లక్ష్మి, అక్కతో, బావతో మొరబెట్టుకొని అతని మన స్సును మార్చివేయవచ్చన్న ధైర్యంతో వెంకన్న నను సరించింది. కాని, వీధులుదాటి, వూరుదాటి గ్రామ పొలిమేరలు దాటి పొలంగట్టుపై నడుస్తున్నాడు వెంకన్న. లక్ష్మి మనస్సు గతుక్కుమన్నది. మూడు మైళ్ళదూరంలో వున్న రైలుస్టేషనుకి అడ్డదారిన తీసుకపోతున్నాడని గ్రహించింది. చీకటి బాగా అలుముకొన్నది. మినుక్కు మినుక్కు మంటున్న నక్షత్రాలకాంతిలో దారి తెలియడం కష్టంగావున్నా ఏదో వేగంలో నడుస్తున్నారిద్దరు. కప్పలు బెకబెక లాడే శబ్దం, దూరంలోని నక్కలకూతలు లక్ష్మి మనో దారుఢ్యాన్ని మరింత బలహీనపరుస్తున్నాయి. వెంకన్న ననుసరించి నడవడానికి చాలా శ్రమపడింది. ఎలాగో అడ్డదారిలో నడిచి స్టేషన్ చేరుకొన్నారు.

పల్లెటూరికి తగినట్లు చిన్న స్టేషన్. శూన్యంగానే వుంది. వెంకన్న లక్ష్మి తప్ప వేరే ప్రయాణీకులు లేరు. పాయింట్‌మేన్ తనచేతనున్న లాంతరును వెంకన్న ముఖానికి తట్టి. "ఎక్కడికి వెంకన్నా? .... అత్తగా రింటికా ప్రయాణం?... ఎనిమిదిన్నర బండి పదిన్నర కు వస్తుంది. రెండుగంటలు ఆలస్యం.... అంతవరకు ఆ బెంచిమీద కూర్చోండి." అని చెప్పి తనపని చూడ్డా నికి వెళ్ళిపోయాడు.

విసురులో వెళ్ళి బెంచిమీద కూర్చోన్నాడు వెంకన్న. లక్ష్మికూడా బెంచిమీదే కొంచెం దూరంలో కూర్చొంది. నక్షత్రాలతో పోటీ పడుతున్నట్లు స్తంభం లోని లాంతరు వెలుగుతోంది. కనుచూపు మేరలో వెలుగేమన్నా కనుపిస్తుందాఅని చీకటిని చీల్చి అన్వే షిస్తున్నాయి లక్ష్మిచూపులు. వెంకన్న వుండబట్టలేక విసుగుతోలేచి అటు, యిటు పచార్లు చేయసాగాడు. చటుక్కున జేబును తడుము కున్నాడు. అగ్గిపెట్టె మాత్రమే వుంది. ఆకలిని అణచుకో గలిగినాడే కాని, బీడితలపును మాత్రం తమాయించుకోలేక పోతు న్నాడు. స్టేషనులోని కిళ్ళీకొట్టుమూసేవుంది. పగటి పూట కొన్ని నిమిషాలు తప్ప మిగతా సమయమంతా మూసేవుంటుందని బాగాతెలుసతనికి. స్టేషనుకు కొం చెందూరంలో వున్న టీబంకు తను వచ్చేటప్పుడు తెరచే వుండింది. లక్ష్మివైపుతిరిగిచూశాడు. ఏదో ధ్యాసలో పడినట్లే వుందిలక్ష్మి. పాయింట్‌మేన్ గోడకానుకొని కూనిరాగాలు తీస్తున్నాడు. బీడిపీల్చకుండా క్షణం గడపలేననుకొన్నాడు. అయిదు నిమిషాల్లో బంకుకు వెళ్ళిరావచ్చు ... వెంకన్న కాళ్ళుయిక నిలవలేక పోయాయి.

గబగబా నడిచి టీబంకు చేరాడు వెంకన్న. అంగడి యజమానితో బెంచి మీద కూర్చొనివున్న రొడి రం గన్న కొత్తగా విడుదలైన చిత్రంలోని దెబ్బలాట సన్నివేశాన్ని విచిత్రంగా వర్ణిస్తున్నాడు గంజిబెట్టిన వాయిల్ జుబ్బానుండి బనియన్ స్పష్టంగా కనుపిస్తు న్నది. మోలకు పెద్ద పెద్ద పువ్వులువేసిన సిల్కులుంగి. మెడకుచుట్టిన చేతిరుమాలుతో చెమటను తుడుచుకొనే భావనను ప్రకటిస్తు విమర్శిస్తున్నాడు. అల్లంత దూరంలో మనిషిని చూచిందే టీకలిపిన అంగడి పిల్లాడు వెంకన్నకు గరమ్‌చా అందించాడు. చేతికం దించిన టీ త్రాగకుంటే బాగుండదనుకొని తాగే శాడు.

టీ గ్లాసును అందిస్తు, "బీడీలు, తమలపాకులు...." వెంకన్న నాలుకకరచు కొన్నాడు. భోజనాల తర్వాత కిళ్ళీకొట్టులో తనకు బీడీలు, లక్ష్మికి తమలపాకులు కొనే అలవాటులో అనేశాడు. తనకు బీడీ తలపులాగే లక్ష్మికి తాంబూలం పిచ్చి.

తమలపాకులు, వక్కలు సున్నంతో అందించిన పిల్లవాడు, బీడీలులేవు. అన్నాడు. అసంతృప్తితో టీకి, తమలపాకులకు పోగామిగిలిన చిల్లరను జేబులో వేసుకొన్న వెంకన్నకు మరో యోచన తట్టింది. ఇంకా కొంచెందూరంపోతే మరో బంకుంది. ఇప్పుడు నడచినంత దూరం నడవాలి.... రైలు వచ్చేందుకు యింకా సమయం వున్నా, వెంకన్న మనస్సెందుకో వెనుకాడినది. లక్ష్మి ఒంటరిగావుందే?.... వుంటేఏం?.... పాయింట్ మేన్ వున్నాడుగా, లక్ష్మికి తనకు బాగా పరిచయమైనవాడే మరేం భయంలేదు.... అమాత్రం పోయివచ్చేలోగా ఏమీ మునిగిపోదులే.... అని బీడి తలపు అతన్ని ధైర్యపరచింది.

దూరంలో వున్న బంకుకువెళ్ళి బీడీ తీసుకొని అక్కడే ఒకటి ముట్టించాడు. ఒక్కసారి బీడి పీల్చడంతోనే మంచిహుషారు కల్గింది వెంకన్నకు చేతిలో వున్న తమలపాకులను చూచుకొని అలవాటులో వచ్చిన పొరపాటని నవ్వుకొన్నాడు. అంతగా పేచీపడి తమలపాకులు అందిస్తే లక్ష్మి ఏమనుకొంటుంది? తన్ను చులకనచేయదు?....అక్కడే పారేయాలనుకొన్నా అంతపని చేయలేకపోయాడు. లక్ష్మి స్టేషన్లో ఒంటరిగా వుంటుంది. యిలా ఒంటరిగా ఎప్పుడైనా లక్ష్మిని విడిచివచ్చాడాతను. అందులోను రైల్వే స్టేషనులో కటికచీకట్లో తోడులేకుండా! మెరుపుతీగలా అతని మనస్సు మలుపుతిరిగింది. పాయింట్ మేన్ తప్ప మరెవ్వరు లేరక్కడ....చటుక్కున టీ అంగట్లోని రౌడి రంగన్న జ్ఞాపకం మెదిలింది. కొంపతీసి రంగడు స్టేషన్ వైపు వెళ్లివుంటే? వెంకన్న గుండె గుభేలుమన్నది. ఛ....ఎంతపని చేశాడు తను. తన్నుతానే నొచ్చుకొన్నాడు. వేగంగా ముందుకు సాగినాడు. సరిగ్గా టీ బంకు వచ్చేసరికి రంగడులేడు. వెంకన్న సందేహం మరీ బలమైంది. వడివడిగా పరుగులు తీశాడు. ఆవేశంలో లక్ష్మిని పుట్టింట శాశ్వతంగా దిగబెట్టాలనుకొన్న వెంకన్న హృదయంలో ఆక్షణంలో చెలరేగిన చలనానికి అర్థం తెలీలేదతనికి. తెలుసుకోడానికి ప్రయత్నించనులేదు. బిరబిరా వెళ్ళి స్టేషన్లో కాలుబెట్టాడు. బెంచిపై లక్ష్మిలేదు. గుండె జల్లుమన్నది. ఒళ్ళు గగుర్పొడిచింది. "లక్ష్మి!" స్టేషనంతా ప్రతిధ్వనించిందా పిలుపు.

"ఎక్కడికెళ్ళావు వెంకన్నా? లక్ష్మిని ఒంటరిగా విడిచి..."

నిష్టూరంలో నిందించిన పాయింట్ మేన్ వెనుక బిక్కముఖంతో లక్ష్మి నిలుచొనివుంది. నెమ్మదిగా వూపిరిపీల్చాడు వెంకన్న.

లక్ష్మిని చూస్తు, "బీడీలు కొనుక్కోడానికి వెళ్ళాను." పాయింట్ మేన్కు సమాధానమిచ్చాడు.

"బలే వాడివే, లక్ష్మి ఎంత కంగారు పడిందో తెలుసా?" అంటు వెళ్ళిపోయాడు పాయింట్ మేన్

దీనంగా తనవైపుచూచిన లక్ష్మి చూపులకు వెంకన్న మనస్సు మధన బడింది. మరొక బీడీ ముట్టించుకొంటు బెంచిమీద కూర్చొన్నాడు. లక్ష్మి కూడ ఓరగా కూర్చొంది.

బెంచిమీద లక్ష్మి కనుపించనప్పుడు అతని హృదయంలో జనించిన ఉద్వేగం?.... ఎంతలో ఆవేశం .... ఎంతలో అనుతాపం?... ఆవేశంలో లక్ష్మిని తూలనాడినందుకు వెంకన్న బాధపడినాడు. బావ చనువుతో యిచ్చిన దానిమ్మపండ్లకు ఎంతరగడచేసి, అనరాని మాటలతో నిందించాడు తను. రామయ్యా లక్ష్మిని కన్నబిడ్డలాగ చూచేవాడు. అంతటి మనిషిని తనెలా నిందించాడు. ఛ.... సిగ్గుచేటు.... అయినా లక్ష్మి కోరినవాటిని తనతో చెప్పకుండా బావతోచెప్పి తెప్పించుకోవడం మాత్రం బాగుందా? ప్రతిదినం పళ్ళుఫలాలు పట్టుకొచ్చి మరదలికి యివ్వడం ఏం బాగుంది?.... భార్య కోరింది తీర్చలేని స్థితిలో లేడు తను. తన్నడగలేదన్న అక్కసులో ఎన్నిమాట్లాడాడు. వెంకన్న లక్ష్మివైపు చూచాడు. లక్ష్మి మౌనంగా శూన్యంలోకి చూస్తూనేవుంది.

లక్ష్మి! పిలుపులో ఒక విధమైన జాలి, అనుతాపం యిముడుతున్నాయి.

తనవైపుతిరిగిన లక్ష్మికి తమలపాకులను అందించాడు వెంకన్న. లక్ష్మి తమలపాకులను తీసుకొంటు చూపులతో దేన్నో ప్రశ్నించింది. వెంకన్నకు అర్థమైనా ఏమీ తెలియనివానిలా కనుపించుతున్నాడు.

"లక్ష్మీ, ఒకమాటఅడుగుతాను, సరైన జవాబిస్తావా?"

ఉఁ.... తలవూపింది లక్ష్మి.

"ఇటు చూడు.... నీ వెప్పుడైనా ఏదైనా అడిగి నేను తీసుకరాకుండా వుండేనా?"

"నేనెప్పుడు అలా అనలేదే?"

"అయితే దానిమ్మపళ్ళు కావాలని నాతో ఎందుకనలేదు? వాళ్ళనడిగి తెప్పించుకోవడం బాగుందా?" వెంకన్నమాటల్లో ఒకవిధమైన అప్యాయత లాలన ధ్వనించాయి.

"పళ్ళు తెచ్చి పెట్టమని నేనడగనే లేదే?"

"నీవడగ లేదన్నమాట!"

"లేదు... పదిరోజులకు ముందు నావంట్లో బాగా లేదని అక్కయ్య వచ్చినప్పుడు ..."

వచ్చినప్పుడు.... ఉఁ.... చెప్పు....

"నా వాలకాన్నిచూచి పసి గట్టేసింది.... అప్పటి నుంచి దినం ఏదో ఒకటి పంపుతూవుంది ...." వార్త ముగించకముందే లజ్జాభారంలో లక్ష్మి కళ్ళు క్రిందికి వాలిపోయినవి.

వెంటనే అర్థంకాక తికమక పడినా కొద్దిసేపట్లో గ్రహించుకొన్నాడు వెంకన్న. పదిరోజులుగా తన యింటికి వచ్చిన మామిడిపిండెలు, వుసిరిక్కాయలు, నారింజపండ్లు మున్నగు పుల్లటి పండు జాపకానికి వచ్చేటప్పటికి అతని మనస్సు పరవళ్ళు తొక్కింది. ఎగిరి గంతేసి లక్ష్మి చేతులను గట్టిగాపట్టుకొని, "నిజమేనా? నాతో ఎందుకు చెప్పలేదు?" అంటూ లక్ష్మిని చేరదీసుకొన్నాడు.

లక్ష్మి ఎరుపెక్కిన తన ముఖాన్ని అతని గుండెల్లో దాచుకొంటు, "చెప్పాలనుకొంటు నేవున్నా. ఇవ్వాళ ఎలాగైనా చెప్పేయాలనుకొంటున్నప్పుడే యింత రాద్ధాంతం జరిగింది" అన్నది.

త్వరలో తల్లిగాబోతున్న లక్ష్మిని ఎంతగా నొప్పించాను, అని లోలోనే పశ్చాత్తాపపడిన వెంకన్న లక్ష్మి చెక్కిళ్ళపై జారిన బాష్పాలను తుడుస్తు, "పద లక్ష్మి, యింటికి పోదాం పద....లక్ష్మిచేతిని పట్టుకొని మరో చేత్తో మూట నెత్తుకొని, గోడకానుకొని తూలుతున్న పాయింట్ మేన్ కంటబడకుండా మెల్లగా ముందుకు నడిచాడు.

పొలంగట్టుపై నడుస్తున్నప్పుడు రైలుకూత వినబడింది. ఇద్దరు ఒకరినొకరు చూచుకొని నవ్వుకొన్నారు. చాలా త్వరగానే యిల్లు చేరుకొన్నారు. ఇంటి తలుపు తెరిచాడు వెంకన్న. గూట్లో ఆముదపు దీపం ప్రశాంతంగా వెలుగుతునేవుంది. అన్నం వడ్డించింది లక్ష్మి. అన్నం, వంకాయల కూర అన్నీ చల్లారిపోయినా, వెంకన్నకు ఆరోజు వంకాయల కూర రుచించినట్లు ముందెప్పుడు రుచించలేదు.



శారదలేఖలు

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారి రచనలు ఆంధ్రులకి చిరపరిచితములు. ముఖ్యంగా వారి 'శారద లేఖలు' బహుకాలంగా అమితప్రచారం పొందినవి. పదిహేనేళ్ళ క్రితం వారు రాసిన శారద లేఖలు యిటు సాహిత్యలోకంలోనూ, అటుపాఠక లోకంలోనూకూడా ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించుకున్నాయి. మళ్ళీ యిన్నాళ్ళకు వారి చిరపరిచిత శారదలేఖలు మా ఆంధ్రమహిళలో ధారావాహికంగా ప్రచురిస్తున్నామని తెలుపుటకు ఎంతో ఆనందిస్తున్నాము.

సౌభాగ్యవతి కల్పలతకు

నెచ్చెలీ !

కొన్ని సంవత్సరములు రాకపోకలు లేకపోయినచో ఎంత దగ్గర బంధువులు దూరమగుటయు ఉత్తర ప్రత్యుత్తరము లేకున్నచో ఎంతటి ప్రగాఢ స్నేహితులు ఎడమగుటయు సర్వసామాన్యమేగదా. ఒకయేడుగాదు రెండేండ్లుగాదు పదిరెండు దీర్ఘ సంవత్సరములు గడచిన తరువాత నేను నీకు ఉత్తరము వ్రాయుచున్నప్పుడు బహుశః నేను నీ స్మృతిపథములో లేనేమో అనిపించుచున్నది.

ఈ పదిరెండేండ్లలో మనలో మన దేశములో మన ప్రజలలో మన ప్రభుత్వములో ఎన్ని మార్పులు జరిగినవి! తలచుకొనిన ఆశ్చర్యము కలుగుచున్నదిగాదా. ఆనాటి మన పోరాటము దేశ స్వాతంత్ర్యసిద్ధి కొఱకు, ఈనాటి మన ఆరాటమో దేశ పురోభివృద్ధి కొఱకు. ఇప్పుడు మనం తలంచేవి వ్యావసాయికంగా పారిశ్రామికంగా మన దేశమెప్పుడు అభివృద్ధిచెందును, మన ప్రజల దారిద్ర్య మెట్లు నివారితమవును? విద్యావంతులెట్లు కాగలుగుదురు? ఆరోగ్యమెట్లు సిద్ధించును. పిల్లలు యెట్లు వృద్ధిలోకి రాగలరు. స్త్రీ లేవిధముగా పురుషులతో సమానమగు స్థాయికి రాగలరు? అనియేగదా. ఈ సమస్యా పరిష్కారమునకు చేయవలసిన పనియేమి? పంచవర్ష ప్రణాళికలా? సంక్షేమ సంఘముల సంస్థాపనమా? ఏది పథకము? ఏది మార్గము? ఈ ఆలోచనలతో, ఈ కార్యక్రమములతో దేశము నిమగ్నమైయున్నది.

ఈ సమయములో చీనావాడు మనదేశముపై దురాక్రమణకు దొరకొనుట. ఎంత అక్రమ వ్యవహారము! దీనివల్ల బోధపడినదేమి? మీ దేశమును మీరు బాగుచేసికొనుటయే కర్తవ్యముగాదు. మీ దేశమును రక్షించుకొనుటగూడ మీ ముఖ్య కర్తవ్యమే అనిగదా రూఢి పడినది.

కల్పలతా! ఆ చైనావాని దుస్సాహసమేమో. మన పార్వతీదేవి పుట్టిన మంచుకొండ: మన దేవతలు విహరించిన హిమగిరి. మన మహర్షులు తపంబుసల్పిన హిమాలయము! మన కేదారేశ్వరుడు అధివసించిన హిమవన్నగము! మన బదరీనాథ బ్రహ్మ కపాలక్షేత్రములతో పవిత్రమైన హిమవత్పర్వతము! మన పవిత్ర గంగా బ్రహ్మపుత్రలు జనించిన హిమాద్రి: మన గాయకులు గానముచేసిన హిమాచలము! మన కవులు కవిత లల్లిన శీతశైలము: వాని అబ్బసొత్తు (పితృభూమి)ట. ఆ హిమవద్భూధరములలోని రాయి, రాయి, అణువణువు ఆ మంచు కుప్పలలోని బిందు బిందువు. కణకణము మన సంస్కృతిని, మన సాంప్రదాయమును, మన ప్రాచీనతను వేనోళ్ల చాటుచుండ. ఆ సేతుశీతనగపర్యంతము మనదేనని చారిత్రక సత్యము లెన్నో నిరూపించుచుండ మన మంచుకొండ చీనావాని దెట్లగును? హిమాలయములు మావనుటకు అనంత సాక్ష్యములున్నవి. వాని కేమి సాక్ష్యమున్నది? మాటి మాటికి మార్చి మార్చి త్రిప్పి త్రిప్పి తనకుతానై వ్రాయించుకొనిన దేశపటములు తప్ప అవి తమవనుటకు వానికేమి ఆధారమున్నది? అయిననేమి? దురాక్రమణపరులకు దుర్వినీతులకు హద్దుపద్దులతో, వేదాదుల ప్రామాణికములతో పౌరాణిక దృష్టాంతరములతో, చారిత్రక సాక్ష్యములతో పనియేమి? అక్రమముగా ప్రవర్తించువారికి సక్రమమైన న్యాయములను, ధర్మములను పాటించుట ఉండునా? అక్రమముగా ఆకస్మికముగా వచ్చిపడుటయే వారి లక్షణము.

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ

మన మాతృభూమియైన భారతవర్షము విదేశీయ పాలనా దానిసత్వ శృంఖలలనుండి విముక్తయై పట్టుమని పదునారేండ్లు నిండలేదు. ఇప్పుడిప్పుడే పంచవర్ష ప్రణాళిక లేర్పరచుకొని వ్యావసాయికంగా, పారిశ్రామికంగా ముందుకు రావలెనని కృషిచెయుచున్నది. కట్టుచున్న ప్రాజెక్టులు, పెట్టుచున్న పరిశ్రమలు ఇంకను అరగొరగానే ఉన్నవి. ఇంతలో దేశ రక్షణ బాధ్యతగూడ మనపై వచ్చిపడినది. ఇది సామాన్యమైన దేశోపద్రవముగాదు, ఇంతలో తీరునదియు గాదు

చీనాదేశము అరువదికోటుల జనసంఖ్య గల పెద్ద దేశము. చీనా ప్రధాని చౌయెన్‌లై అతి కుటిలుడు. పంచశీల సిద్ధాంతమును ఆమోదించుచుంటినని నీతికి నిజాయితికి విఖ్యాతిగన్న మన ప్రధాని జవహర్ పండితుని నమ్మించి దేశ రక్షణయందు ఉపేక్షగానుండునట్లుచేసి యీ పదునైదు సంవత్సరములలో యుద్ధానికి అవసరమగు బాటలువేసికొనియు, వంతెనలు నిర్మించుకొనియు, స్థావరములు గట్టుకొనియు యుద్ధ పరికరముల నాయత్త పఱచుకొనియు సర్వసన్నద్ధుడై మనపై వచ్చిపడినాడు. మనమో అనుమానమేలేక మన ప్రణాళికా నిర్వహణలో నిమగ్నులమైయున్నాము, సర్వసిద్ధమైన ఒక మహా సైన్యము పరాకుగాఉన్న దేశముపై వచ్చి పడినప్పుడు దాని నెదుర్కొనుట యెంతకష్టము? అయినను ఈ సమయములో ప్రజలందరేకమై, అన్ని పక్షములవారొక్కటై ప్రభుత్వమునకు బాసటగుటయు, అమెరికా యింగ్లండువంటి పాశ్చాత్య దేశములు యుద్ధావసర సామాగ్రి నొసగుటకు ముందుకువచ్చుటయు శుభ సూచకమనియే చెప్పవలెను.

యుద్ధమనిన సామాన్యమా; ఆయుధసామాగ్రి కావలయును, ఆహారపదార్థములు కావలయును, పోరాడగల యోధులు కావలయును పోరాటము సాగింపగల ప్రవీణులు కావలయును, పరిచర్యలు చేయగల సేవానిరతులు కావలయును, అన్నియు నెరవేరుటకు కోట్లకొలది ధనము కావలయును, దానికి మన కాగితపునోట్లు. నికిల్ నాణెములు పనికివచ్చునా? వాని చెలామణి మన దేశమునకు మాత్రమేపరిమితముగదా బంగారమిచ్చినగానిపరదేశముల నుండియే వస్తువును రాదు. అందులకే మన ఆర్థికమంత్రి మొరార్జీ దేశాయ్ బంగారమో అని ఘోషించుచున్నాడు.

మన దేశమున స్త్రీలు అలంకరణార్థము స్వర్ణాభరణములు ధరించుట యుగయుగమునుండి స్త్రీధనముగా నుండి అప్పునకు, ముప్పునకు, ఆకటికి అక్కఱకు ధనముగాని. ఏ ఋణపత్రములుగాని ఇల్లాలి మెడతో నగవలె ఆపదకు ఆదుకొనుటకు అందిరాదు. మగవారుస్త్రీలకు నగలు చేయించుటలో గూడా అలంకారార్థమనియే కాకుండ అవసరమైనప్పుడు తనకుఅక్కఱకు రాగలదను తలపుగూడా ఉన్నది. ఏ కారణమువల్లనైననేమి స్త్రీల వద్ద యింతబంగారము నిలువ ఉండబట్టియేగదా ప్రభుత్వమునకిపుడు సహాయము చేయగలిగినది? దేశరక్షణార్థముప్రాణమే యొడ్డవలసిన ఆపత్సమయములో బంగారమొడ్డుట ఒకపెద్దవిషయము కాదుగదా. విచిత్రవిషయమే మన పరదేశములవారికి మనము బంగారమునిచ్చి యినుప సామాగ్రి (యుద్ధపరికరములు) చేకొనుచుండగా వారు యినుమునిచ్చి బంగారము చేకొనుచుండగా శాంతికాముకురాలైన సింహళప్రధాని శ్రీమతి సిరిమావో ఆఫ్రేషియా రాజ్యములారింటిని సమావేశ పఱచి శాంతి కారకములైన తీర్మానములు చేయించి ఆ తీర్మానములను తానే స్వయముగా తీసికొని వెళ్లి పెకింగులో చీనాప్రధానికి సమర్పించి చల్లని మాటలాడి ఢిల్లీకివచ్చి మనప్రధానిని కలిసికొని మంతనములాడి వెళ్లినది. ఆమెసూచనలకు మన ప్రభుత్వము అంగీకారము తెలిపినది. యుద్ధోన్మాదియైన చౌయెన్‌లై నిరాకరించినాడు.

తనకు శానైవచ్చి దాడిసాగించి 14 వే. అయిదు వందల భారత భూభాగమును ఆక్రమించుకొనిన చీనా ప్రధానిని ఇకనెంత మాత్రము నమ్మరాదు. ఎల్లప్పుడు యుద్ధము రాగలదనియే భావించుకొని ఆయత్తులమై యుండవలయును.

దానికితోడు చీనావారు, పాకిస్థాను కాశ్మీరులోని ఆక్రమిత ప్రాంతమును పంచుకొనినట్లు తెలియుచున్నది. ఎంత విచిత్రము? 2050 మైళ్ల ప్రాంతము పాకిస్థాను చీనాకు దత్తముచేసెనట దానికి బదులుగా చీనావాడు పాకిస్థానుకు 1300 మైళ్ల భూభాగము యిచ్చెనట. ఈ ప్రాంతమెవరిది? వీనిదిగాదు వానిదిగాదు మనది. దీనిని దొంగలు దొంగలు వూళ్లు పంచుకొనినట్లు ఉభయులు పంచుకొనినారు. ఈ శత్రువులిద్దఱు ఇట్టి అపాత్రపు పనులు చేయుచున్నప్పుడు యుద్ధము విరమింపబడినదని గాని యికముందు జరగదని గాని యెట్లు నమ్మగలము? వీర పుత్రికలకును వీరాంగనలకును, వీరమాతలకును ఖ్యాతిగన్న మన భారతవీర నారీమణులపై యిప్పటున నెంతబాధ్యతా భారములు పడినవో వేరుగ చెప్పవలెనా?

—మిత్రురాలు శారద

పెద్దకథ

మబ్బులోని పొద్దు

(విద్యావతి, వినయవతిఅయిన లలితని భార్యగా పొందాడు యింజనీరు గోపాలం. ఏరికోరి చేసుకున్న యీ ప్రేమ వివాహాన్ని తల్లితండ్రులు ఆమోదించినా, తన భార్యని కష్టపెడ్తున్నారని, తల్లి కోడలిని సాధిస్తున్నదని గోపాలానికి మనసులో వేదన. భార్యాభర్తలమధ్య వొప్పందాన్ని వెలిగక్కలేకా, తల్లితండ్రులని ఎదిరించలేకా సత మవుతున్నాడు గోపాలం. ఆఫీసునించి యింటికొచ్చేసరికి భార్య నళ్లుతిరిగి పడుకునుంది. డాక్టరువచ్చి చూసింది. ఎందుకువచ్చిందో ఏంచెప్పిందో అని గోపాలానికి ఆదుర్దా. ఇక చదవండి.)

తనాగదిలో ప్రవేసించి. ఆరుమాసాలయినా మళ్లీ లలిత ఏన్నడూ తనను కల్సుకుని మాట్లాడలేదుసరికదా ఏప్పుడొచ్చి ఎప్పుడు వెళ్తున్నదీ కూడా తనకు తెలియడం లేదు. ఆఫీసులోకూడా ఏదో ముఖ్యమైన పనుంటేనే గాని తనవద్దకు రావడంలేదు. ఆఫీసులోవుండే మిగతా అడ ఉద్యోగులపాటి చనువైనా లలిత తనయందు చూపకపోయినా ఎందువల్లనోగాని అదివరకూ ఆడ వాళ్లనుగురించి ఎన్నడూ తలపెట్టయినా ఎరగని గోపాలం మనస్సు అస్తమానం లలితను గురించే ఆలోచించ సాగింది.

రోజులు సాఫీగా దొర్లుకుపోతున్నాయి. ఒక ఆదివారం నాడు ఇల్లుగలాయినా తనూ సావకాశంగా మాట్లాడుకుంటూ న్నప్పుడు తనపెళ్లివిషయం అందుకు గాను తల్లి తండ్రులు చేస్తూన్న ఒత్తిడి ఆ వివరాలు గోపాలం వల్ల తెల్సుకుని లలిత ప్రస్తావన తెచ్చాడాయన "మీవాళ్లు పెద్ద కట్నాల కాశపడేవారయితే చెప్ప లేను గానీ, లేకపోతే లలితలాంటి పిల్ల దొరకడం చాలా దుర్లభం. అసలు నాకు గనుక ఓ పెద్ద కొడుకుండుంటే, లలితను పరాయిగా పోనిచ్చేవాణ్ణేకాదు ! ఇంతకూ ఇక్కడద్దెలకున్న కుర్రాళ్లందర్లోకీ నువ్వు చాలా యోగ్యుడవు గనక. నీ వద్ద ఆ పిల్ల ప్రశక్తి తెచ్చా'' అన్నారాయన.

"అ సొమ్ముగురించి. మాకేమంత ముఖ్యం కాదు గానీ ఆయనా ఆవిడె అభిప్రాయం ఎలావుందో తెల్సుకో వొద్దూ?" అన్నాడు. గతాన్నంతా మరిచి గోపాలం,

" అదేమిటోయ్? చెరుకు తినేందుకు కూలిబేరమాడే టంత అవివేకురాలను కున్నావేమిటి లలితమ్మ! అయినా ఎందుకన్నా మంచిదీ ఓ సారి ఈవిషయం ఆపిల్లతో సంప్రదించి, ఎల్లుండీపాటికి ఏసంగతీ నీ చెవినేస్తానులే." అన్నారు తృప్తిగా ఆయన. ఆయన పెట్టిన గడువు దాకా కూడా గోపాలం కనిపెట్టుకో వల్సిన అవుసరం లేకుండా ఆ మర్నాడు లంచి టయిమప్పుడే ఏదో ఫైల్లు తిరగేస్తూన్న గోపాలం ముందు కొచ్చి నిలబడింది లలిత తిరగేస్తున్న ఫైలు మూసేస్తూ ఆశ్చర్యంగా లలిత వేపు చూశాడు. గోపాలం.

''మావయ్యగా రన్ని సంగతులూ విపులంగా చెప్పారు. ఆయన సలహా కార్యరూపంగా జరగడం అసంభవం. ఆ సంగతి చెప్పేందుకే నే నొస్తే'' అంది. నిబ్బరంగా తనవేపు చూస్తూ లలిత.

''ఎందుకని? మీకలాంటి అభిప్రాయం లేకనా?'' తడబడుతూ అడిగాడు.

"లేకేం? మనస్ఫూర్తిగావుంది అయితే."

శ్రీమతి గుళ్ళపల్లి సుందరమ్మ

''చెప్పండి?''

''మన ఇద్దరిమధ్యా వున్న తారతమ్యాల అగాధం అలా జరగనివ్వదు. నేనొక దిక్కు లేనిదానను పేదరాల్ని మీరు పదిమంది గల పెద్దకుటుంబంలోనివారు సంపన్నులు మీ వివాహ సందర్భంలో ఆర్థికరూపంగా ఎన్నెన్నో సరదాల్ని ఎదురుచూసే మీవాళ్లు ఏవిధంగానూ అందు కర్హతలేక ఏవజ్జీవనం తమరే అన్ని విధాలా భరించా ల్సిన నావంటిదాన్ని కోడల్నిగా చేసుకుందు కొప్పుతారా మీరేచెప్పండి? ఇన్నీ తెలిసుండీ ఆశపడీ మీవాళ్లనూ మిమ్మల్నూ ఇబ్బంది పెట్టేకన్నా మొదట్లోనే పరిస్థితు ల్నర్థంచేసుకుని తప్పుకోవడం తెలివైన పనికదూ?'' అంది గంభీరంగా వొంచినతల ఎత్తకుండా. నమ్రతగా మసులుకుపోతూండే లలితలో. ఇంత ధైర్యం దాగి వుందని ఎన్నడూ అనుకోలేదతను.

''మీ మనసూ మీ ఇష్టాన్నీ చెప్పకుండా ఏవేవో చెప్పుకుపోతున్నారు.''

''చెప్పానుగా గోపాలంగారూ. ఒక్కసంగతి. భూమ్మీద పుట్టిన ప్రతివ్యక్తికీ. ప్రపంచంలో అన్నిటికన్నా ఉన్నతమైనవన్నీ తమకులభ్య మవాలని కోరడం సహ జం. అయితే ఎవరికెంతవరకూ, అర్హతుందో అంత వరకేగాని. ఎక్కువెలా లభిస్తుంది?''

''మీరు చెప్పేది చాలా పెద్ద విషయం ఇప్పుడు మనమిద్దరిమధ్యా అంత అనుకోరానంత తేడా ఏదీ లేదే? ఏకొద్దో అలాంటి వున్నా, సర్దుబాటుచేసే పూచీ నాదీ'' అన్నాడు. ప్రతివాక్యం నిజంసుమా అన్నట్టు వొత్తి నిరూపిస్తూ.

''అయితే నాకేమీ అభ్యంతరంలేదు సరికదా! నా యందు ఇంత ఔదార్యం చూపిన మీకు నాధన్యవాదాలు ఇంకవొస్తా నమస్తే?'' అని చేతిగడియారం చూసు కుంటూ అక్కణ్ణుంచీ వెళ్లిపోయింది ఆవిడ.

తేలికపడ్డ మనసుతో లలితవేపే చూస్తూ నిల్చున్న గోపాలం మళ్లీ ఉలిక్కిపడుతూ నాలుక్కొరుక్కున్నాడు. ఏదో పెద్దత్యాగం చేస్తున్నాననుకుని ఎంతపెద్దపొరపాటు చేశాడు తను? పాపం ఆవిడె విడమరిచి అన్ని అవాంత రాల్నూ, తెలియపరిచినా! తనబుద్ధి ఇలా ముంచుకు పోయిందేం? అసలావిడతో మాట్లాడుతూన్నంత సేపూ, తను తనుగా లేనంత దుర్బలత్వం ఎక్కణ్ణుంచీ వొచ్చి ఆవహించిందీ తననూ! దీన్నే విధి విలాసం అంటారా? నిజం. అందుకే ఎంతటివారైనా ఆ సమయం వొచ్చే సరికి బుద్ధి మసించుకుపోయి, విధిచేతి కీలుబొమ్మగా మారిపోతారు. లేకపోతే తన ఎదార్ధ పరిస్థితేవిటీ? ఆవిష యం ఆలోచించకుండా తనుచేసిన వాగ్దానం ఏవిటి? మొన్న ఇల్లుగలాయన దగ్గర మాటజారినందుకే ఎలా తప్పించుకోవడమా? అని బాధపడుతూన్న తను అసలు వ్యక్తిదగ్గరే ఆమాటను సిసలుచేశేసాడే! వెధవ గొడవ. కాలుజార్నా తీసుకోవొచ్చుగాని మాటజారితే. దాన్ని సర్దుకునేదెలాగా? అందులోనూ ఒక అమాయకను. వివాహానికి ప్రోద్బలపరిచేశాక హుం ఇకదీన్ని తిప్పు కోడమన్నది అసంభవంగనక. సాధించగల్గే ఉపాయం కన్నా త్వరగా ఆలోచించాలి.

చదువుకో కావాల్సిన తమ్ముల్లూ, పెళ్లిళ్లు కావాల్సిన చెల్లెళ్లూ, అందరితో సహా తనను నమ్ముకునున్న తల్లి దండ్రులొక్కసారి అతని కళ్లల్లో మెదిలి కళ్లు నీళ్లు గమ్మాయి.

కాస్త కలిగినవాళ్ల పిల్లను తనకుచేస్తే ఆ కట్నం సొమ్ము సుశీల పెళ్లికొక్కస్త ఆసరా పడుతుందని నాన్న తాపత్రయం. కట్నంలేకుండా పెళ్లి చేసుకోవడం వీలయి నంత వరకూ నిరాధారురాలైన దాన్ని చేసుకుని ఉద్ధరించ డం ఇలాంటివన్నీ మెచ్చుకోదగ్గ త్యాగాలే గాని అందుకు ముందంజ వెయ్యాల్సినవాళ్లు, ఒకరిసొమ్ముతో నిమిత్తం లేకుండా ఎందరయిన్నా పోషించగల్గే భాగ్యవంతులు అంతేగాని పైసా తీస్తే, ఆవెత్తి అలాగే నిల్చిపోయే తమలాంటి మధ్యతరగతి కుటుంబీకులుగాదు. నిజంచెప్పా లంటే ఇటు ఇంట్లోవాళ్లను తుడిచేసి తనకు నచ్చినచోట పెళ్లిచేసుకుని కులుకుతాననటం స్వార్థమనే అనిపించు కుంటుందిగాని త్యాగం అనిపించుకోదేమో? ఇంతకూ తనలాగే మిగతా పిల్లల్నూ ఓదరి చేర్చాల్సిన భాధ్యత నాన్నమీదుండబట్టే అర్హుడైన తనకు కట్నం కోరుతు న్నాడుగాని తీరికూర్చుని డబ్బుకాంక్షవల్ల కాదుగదా ఉస్ ఇలాజరిగిపోయిన కాలాన్ని విస్మరించి బుర్ర పాడు చేసుకుని ఇంక ఏంలాభం? దీనిబదులు జరగాల్సిన దాన్ని ఆలోచించినా సార్థకం వుంటుంది. అనుకుంటూ మళ్లీ తన పనిలో నిమగ్నుడయ్యాడు గోపాలం.

రోజులు గబగబా దొర్లుకుపోతున్నాయిగాని అటు తల్లితండ్రులకూ ! ఇటు లలితకూ ! అన్యాయం జరక్కుం డా పనిజరిగే ఉపాయం ఒక్కటన్నా అతనికి తోచలేదు. పోనీ లలితతో ఈ విషయం సంప్రదించి చూద్దామను కున్నా, మునపట్లాగే ఏ ఆఫీసుపనో వున్నప్పుడు తప్ప లలిత దర్శనమే తనకు లభించడంలేదు.

ఒకట్రెండు సార్లు ఇల్లుగలాయన తనపెళ్లి విషయం మాట్లాడినప్పుడు ఆయన్నే ఏదన్నా సలహా అడిగేద్దామని కూడా అనుకున్నాడుగాని ఆ రోజాయన కట్నం సంగతెత్తినప్పుడు అంత నిర్లక్ష్యంగా తోసి రాజు చేశేసిన తను, ఈ నాడు తనంతట తనే తమఇంటి ఆర్థిక ఇబ్బదుల్ని ఆయన్తో చెప్పుకోవడమంత అవమానం మరోటి వుందా?

అయితే అదృష్టవశాత్తూ మరో రోజు ఆయనే ఈ సమస్యను పరిష్కారం చేశేశాడు. "చూడు గోపాలం ఎంతో తొందరపడాల్సిన పెళ్లివిషయంలో నువ్విలా తటస్తంగా ఊరోకవడం చూస్తే ఏదో విషమసంధిలో నువ్వు చిక్కుకున్నట్టు తోస్తూంది. నేనూహించినట్లు అది ఆర్థిక ఇబ్బందే గనక అయితే పిల్లవాణ్ణి గనక ఉర్కే చెయ్యలేనుగాని. అవసరానికేమాత్రమేన్నా సర్దుబాటు చెయ్యగల్ను ఇః మాటసాయం పనిసాయం అన్నావ్? ఓ. ఎంతయినాసరే నేనూ మా ఆవిడా కూడా శక్తివంచన లేకుండా చేస్తాం ఇలాచెప్తున్నానని మరోలా అనుకోకేం? నేనూ నీవయసులో ఇలాంటి యాతన్లన్నీ అనుభవించిన వాణ్ణె గనక చెప్తున్నా అన్నారు "మన మనో పోరాటం ఈయన కెలా తెల్సిందా?" అనుకుంటూన్న గోపాలం సందేహాన్నికూడా నివారిస్తూ.

"తప్పకండానూ, మీ సహాకారం లేనిదే మా ఆశయం ఎలాగో ఫలించదు. అవసరంపడ్డప్పుడు విన్నవించుకుంటాం" అంటూ ఆయన్నభినందించాడు గోపాలం ఆ తరువాత త్వరగానే ఒక నిర్ణయానికొచ్చిన గోపాలం ఆ సంగతి లలితతో చెప్పేందుగాను సాయింత్రం చాలా సేపు ఆఫీసుగేటు దగ్గరగా రోడ్డువార్ని పచార్లుచేస్తూ ఎలాగైతేనేం లలితను కల్సుకుని తన వెంటనే ఆసకట్టవేపుకి తీసుకెళ్లాడు.

''మీతో కొన్ని ముఖ్య విషయాల్ని సంప్రదించేందుగ్గాను ఇలా తీసుకొచ్చాను. అంటే, వివాహం జరిగేందుకు ముందు మన అంతరంగిక విషయాల్నికూడా ఉభయులం కలిసే ఆలోచించుకోవడం మంచిదని నా అభిప్రాయం. ఇక నా స్వంత విషయాల్ని చెప్తా వినండి నిజం చెప్పాలంటే మీరనుకుంటూన్నంత సంపన్నుల పిల్లవాణ్ణికాను నేను. పైగా! చేస్తున్న సాధారణ ఉద్యోగంలోంచి కూడా మానాన్న త్వరగా పెన్‌షన్ తీసుకోబోతున్నందున ఇకమీద కుటుంబ భారమంతా పెద్దపిల్లవాణ్ణయిన నేనే భరించాల్సొంటుంది కూడా, నా చదువుకోసరం అయినవ్యయం ఫలితంగా ఇదివరకే కొన్ని నిబంధన్లకు నేను లోబడ్డంకూడా జరిగింది. అందువల్ల ఇలాంటి పరిస్థితులోవున్న నన్ను వివాహం చేసుకున్నందుగ్గాను ... మీరు, కూడా''— నాన్చాడు గోపాలం.

''తప్పకుండా సహాకరించగల్ను వీలైనంతవరకూ నా సంపాదనా నా ఆస్తీ, నేనూ మీకు సాయపడగల్గడమే నాకు పరమతృప్తి, ఆనందమూనూ'' అంది నిశ్చలంగా లలిత. ''అదే నే కోరేదీనీ, ఇక ఇన్నాళ్లూ బుర్రవేడెక్కేటట్టునే చేసిన ఆలోచనా సారాన్ని మూడు ముక్కల్తో మీకుచెప్పేస్తా వినండి. నాపెళ్ళికి తీసుకోబోయే కట్నంతో మా చెల్లెలి పెళ్లిభారం కొంతవరకూ తమాయించుకోవొచ్చునని మా నాన్న ఆశయం. వేరే గత్యంతరం కూడా లేదు మరి అందుకని మీరు మరోలా అనుకోకపోతే మీ ఇల్లుఅమ్మేసి దానికి సాయం ఇంకా కావల్సిన సొమ్ము మన ఇంటివారివద్ద నెలవారిగా తీర్చే పద్ధతిని తీసుకుని మావాళ్ల మనసు నొప్పించకుండా మన వివాహం కానిస్తే బాగుంటుందని తీర్మానించాను. ఇందుకు మీకేవన్నా అభ్యంతరం వుంటుందా?'' అన్నాడు తాపీగా.

అలాంటిదేమీ, లేదుగాని. ఈ రోజుల్లో ఇన్‌జనీయరింగ్ ప్యాసైన పెళ్లికొడుకుంటో సిసలైన కన్‌ట్రోల్ ప్రెయిజే పదివేలుపైగా మా ఇల్లెసంత పెద్దదికాదు మహా పోతే ఎనిమిదివేలకు పోతుందేమో! మీరన్నట్టు పైన కావలసిందేదో మామయ్యగారివద్ద తీసుకుంటే? నా జీతంలోంచి నెలకింతని తీర్చుకుంటాను, ఆ తర్వాత కూడా మీవాళ్లకభ్యంతరం లేకపోతే'

"అమ్మయ్యో' కావలసినంత అభ్యంతరంవుంది ఆరుమూడైనా తనకోడలు ఉద్యోగం చేశేందుకు మా నాన్నెన్నడూ ఒప్పడు అంతేకాదు మీరిన్నాళ్లూ రెక్కలకష్టంతో బతుకుతున్నట్టుగానీ, ఇప్పుడు మీ ఇల్లుఅమ్మావని అప్పుకూడా చేశాంఅనీ ఈ వ్యవహారం అంటే? ఈ అప్పువగైరాలన్నీ తీరేదాకా మావాళ్లకెవ్వరికీ తెలియకూడదు సరికదా, మరెవరన్నా వారికి చెప్పేటందుకూడా అవకాశమివ్వకూడదు. ఈ పెళ్ళివిషయంలో మన ఇంటివారు సహాయంచేస్తామని మాటిచ్చినందున మీకు వారుదగ్గర బంధువులనీ, మీ తలితండ్రులు మీ పెళ్లికేర్పాటాయించిన సొమ్ముతో సహా మిమ్మల్ని వారి కప్పగించాననీ మా వాళ్లతో చెప్పదల్చుకున్నా. లలితా, ఎన్నడూ ఆబద్ధమాడి ఎరగని వాణ్ణి ఇప్పుడు నీమీద మమకారంకొద్దీ? నావాళ్లతో అబద్ధమాడదల్చు కున్నా'' అన్నాడు ఆవేశంగా, లలిత నేకవచెనంతో సంభోధిస్తూ.

"మీ ఆలోచనన్లకంతరాయం చెప్తున్నందుకు క్షమించండి. అంత్య నిష్ఠురంకన్నా, ఆది నిష్ఠురం మేలంటారు. పెద్దవాళ్లవద్ద నిజం దాచడంవల్ల ముందు ముందు అనేక ఇబ్బందులు కల్గచ్చు గనక ఈ విషయాన్ని మరోసారి విమర్శించుకున్నాకనే కార్యక్రమంలో దిగడంమంచి దేమో'—ఇంతకన్నా, మీరు సమ్మతించారంటే మావయ్యా గార్ని సాయంతీసుకుని ఒకసారి మీవూరు వెళ్లి నా పరిస్తితంతా చెప్పి వారి కాళ్లు పట్టుకుంటా ఆపైని వారు సమ్మతించడమో? నిరాకరించడమో: నా అదృష్టాన్ని బట్టివుంటుంది." అంది దీనంగా లలిత.

"ఒద్దు, ఒద్దు, అలా ఏవన్నా చేస్తే మొదటికే మోసం వస్తుంది ఇంతకూ ఈ ప్రకారం చెయ్యడంలో నావరకూ అన్యాయంగా, ఏవీ కనుపించదు. అలాంటప్పుడంత భయపడ్డందేనికీ? వారు కోరిన డబ్బు వారికందడం. సాంప్రదాయమైన ఇంటిపిల్ల కోడలవడం ఈ రెండూ సక్రమంగానే జరుగుతున్నప్పుడు ఆ సొమ్ము ఏవిధంగా వొస్తే వారికేం? అందువల్ల నా మాటవిని తొందరపడి నువ్విలాంటి పొరపాటేమీ చెయ్యకు" అన్నాడు. బతిమలాడే ధోరణితో!

"ఏమో ఎప్పటికన్నా ఎదార్థం తెలియకపోదుగదా అప్పుడిక ఇన్నాళ్లూ వార్ని వంచించినందుకు మనమీద ఏవగింపు కల్గదూ? మరోవిషయం నే నుద్యోగం చేసేం దుకు మీవాళ్లొప్పరన్నారుగదా? మరలాంటప్పుడు మీ జీతంలోంచి బాకీ చెల్లిస్తూంటే: ఆ సంగతి మీ నాన్న గారికి తెలియకుండా ఎలావుంటుంది? తమ"

"అరెరే పీకపట్టుకొనే ఈ విషయం నే నాలోచిం చనే లేదే: ఇంకా నయం. నీకన్నా గుర్తుకొచ్చింది. ఊం! మళ్ళీ కథ మొదటికొచ్చింది. మరో ఉపాయ వేదన్నా ఆలోచించాల్సిందే ఇంక" అన్నాడు. ఆలో చనలో గడ్డం తడువుకుంటూ:

"పోనివ్వండి రోజూ పగలంతా నేనుద్యోగంలో కెళ్లేటందుకు మీవాళ్లొప్పకపోయినా రోజూ పొద్దున్నో, లేక సాయంత్రమో ఓ మూడుగంటల అవకాశం నాకిస్తే చాల్ను. ఈ బాకీ మెల్లి మెల్లిగా నేనే చెల్లించెయ్యగల్ను."

"ఎలాగా?"

"ఈ ఊరి మహిళా సంఘంవున్న భవనంలో వెనక వేపు ఆడవాళ్లకు ప్రత్యేకంగా టైప్ ఇన్‌స్టిట్యూట్ ఒకటి కొత్తగా స్థాపించారు. అందులో పనిచెయ్యవల్సిందిగా నన్నెన్నోసార్లు పిల్చారుకూడా!"

"ఇహనేం? ఒకటోరకమైన ఉపాయం అయితే ఇందు కోసరం రోజూ వెళ్తున్నట్టుమాత్రం వాళ్లకు చెప్పకు.

"అదెలా సాధ్యమౌతుందీ? ఎప్పుడన్నా ఈ ఊరొచ్చారంటే పట్టుపడిపోనూ?"

"అలా జరక్కుండా ఏర్పాటుచేసే పూచీ నాదీ, నువ్వు వీలైనంత త్వరగా ఆ పన్లో చేరిపోమరి?" అన్నాడు ఉత్సాహంతో గోపాలం.

"సరి పెద్దవాళ్ళతో ఇలా చెలగాటాలాడ్డం చాలా ప్రమాదకరమైన పనైనా మీకోసరం ఒప్పుకుంటున్నాను. ఈ కారణంగా వారివద్ద ఎంత లోకువపడాల్సున్నా ఎన్ని మాటలు పడాల్సివున్నా సహనంతో సహించుకుపోతాను. అయితే మీరుమాత్రం...."అంటూ ఆగిపోయింది లలిత.

"ఊ, సంకోచించొద్దు"....అంటూ హెచ్చరించాడు గోపాలం.

"పరిస్తితుల్నిబట్టి నేన్నడుచుకుపోవాల్సుంటుంది గనక అలాంటి సమయాల్లో మీరు నన్నపార్థం చేసుకో రాదు సరికదా ఇంట్లో అశాంతి రేగకుండావుండేందుగ్గాను కొన్ని కొన్ని సమయాల్లో మీరుకూడా నన్ననుసరిం చాల్సి వుండొచ్చు. ఈ అవకాశం మీరు నాకివ్వాలని నా ప్రార్థన. దీన్ని మీ రెన్నడూ ఎలాంటి సమయంలోనూ మర్చిపోకూడదు." అంటూ గోపాలంవేపు చూసింది. అతడు పరాగ్గా ఎటో చూస్తున్నాడు.

"ఏం? వివాహానికి పూర్వమే ఇన్ని వాగ్దానా ల్చేయించుకుంటూందే అనుకుంటున్నారా? తొందరగా మేడ కట్టేశేకంటే ముందుగా పునాది బలంగాచేసుకోవడం మంచిదికదూ?" అంది తిరిగీ లలిత.

"తప్పకండానూ అందుకే మొగవారికన్నా ఆడవారి కెంతదూరాలోచనో అనుకుంటున్నా. ఇక నీ ప్రశ్నకు సమాధానం విను. ఎలాంటి గడ్డు సమస్యల్నయినా గంభీ రంగా ఎదుర్కొని ముందు ముందు నామీదనున్న బాధ్య తల్ను నెరవేర్చడంలో నాకు చేదోడు వాదోడుగా వుండా లనేగా నిన్ను నే కోరిందీను. అందుగ్గాను నువ్వెలా మసులుకోవాలన్నా నేను సంసిద్ధంగా వుంటా. నామాట నమ్ము" అన్నాడు. లలిత చేతిని తనచేతులోకి తీసు కుంటూ ఆవేశంతో.

"మంచిది ఇక ఇంటికెళ్దామా?'' అంది మెల్లగా తన చేతిని తీసుకుంటూ లలిత. ప్రశాంతమైన ఆ గోదావరి



నేను ఇప్పుడు చేయగలిగిన సహాయమేదైనా వుందా?

దేశ ఆంతరంగిక రక్షణకు ప్రతి భారతీయ మహిళ ఇప్పుడు చేయగలిగింది చాలా వుంది. మహిళా వ్యవస్థల ద్వారా రక్షణ కృషిలో పాల్గొనండి. చేయవలసింది ఎంతో వుంది. జాతీయ రక్షణ నిధికి విరాళాలివ్వండి, విరాళా లిచ్చేటట్లు ఇతరులను ప్రోత్సహించండి. రక్షణ సర్టిఫికేట్లు కొనండి. ఇదేగాక మీరు క్రమశిక్షణ, ప్రవర్తన, దృక్పథం మొదలైన వాటిలో స్వయంగా చేయవలసిన కృషి ఇంకా వుంది.

- *వ్యర్థ వ్యయం మానండి; అనాలోచితంగా కొనడం మానండి; అధిక ధరలను చెల్లించవద్దు.*
- *బంగారం కొనవద్దు. దేశావసరాలకు మీ బంగారం యివ్వండి.*
- *మీరు ఏపని చేస్తున్నా దృఢతర దీక్షతో పనిచేయండి; సమర్థంగా చేసిన ప్రతి పని జాతీయ కృషిని, భారతదేశ స్థితిని శక్తివంతం చేస్తుంది.*
- *అలసత్వం వదిలి ఆచరణకు పూనుకోండి.*

అప్రమత్తులై వుండండి

—జాతీయ రక్షణ కృషిలో పాల్గొనండి

DA 62/F 7

తీరంలో ప్రశాంతిచెందిన హృదయాల్తో ఆ ఇద్దరూ తిరివేపు నడిచారు.

*   *   *

ఆ 'మరువారమే పెళ్లిచూపుల పేరిట ఒకవారం శెలవుపెట్టి, ఊరికెళ్ళాడు గోపాలం. తల్లిదండ్రులు ఏరి పుంచిన సమ్మంధాలన్నింటి వివరాలూ శ్రద్ధగా విన్నాక లలితనుగురించి తను సృష్టించిన ప్రకారం వారితో చెప్పాడు అనుకున్న అన్నింట్లలోకీ లలితవల్లే కట్నం ఎక్కువొస్తున్నందునా మిగతా అందరికంటె లలితే విద్యా బుద్ధులు గలదే కాక తమకొడుక్కీ బాగా నచ్చి నందునా ఈ సమ్మంథమే అతని తల్లి తండ్రులూ ఒప్పు కున్నారు. గోపాలం మనసు ఆనందంతో నిండిపోయింది.

''పిల్లకేవన్నా కాస్త వంటా పెట్టూవచ్చునట్రా? ఒంటి కాపురం చెయ్యాలిగదా నని అడుగుతున్నా'' అంది రాత్రి భోజనాలవద్ద తల్లి.

''వొదినకు జడ పెద్దదేనా అన్నయ్యా? ఏం రంగూ? మా అందరితో సరదాగా కలిసుంటుందా!'' ఇలా ప్రశ్నల వర్షం కురిపించేశారు చెల్లెళ్ళు. అన్నింట్లకూ నవ్వుతూ సమాధానా లిచ్చిన గోపాలం. "అన్నీ బాగానేవున్నాయి గానీ ఒక్కదుర్గుణవమ్మా! గాలీవానా ఒచ్చినా సరే, పిడు గులు పడుతున్నా సరే క్లబ్‌కి వెళ్ళందే మాత్రం ఒక్క రోజన్నాఆగలేదుటాపిల్ల" అన్నాడు. ఆమాటకు చెల్లెళ్లూ తమ్ముళ్లూ పకపకా నవ్వారు.

''ఆ? ఏంవుందనర్రా, అంతనవ్వూ ఒక్కత్తే ఇంట్లో వుంటే తోచక వెళ్లేదిగావల్ను. అదె అలవాటైఊర్కుంది ఇహ నెంతా? ఈఏడాదీ అయిపోతే మీ నాన్న పించినీ పుచ్చుకుంటారుగా? అందరం ఇంట్లో సందడిగా వుంటె ఆ అలవాటు దానంతటదే పోతుంది''అంది తల్లి.

''కాకపోయినా చదువుకున్న పిల్లయాక కాస్త ఏ క్లబ్బుకో, ఏ స్నేహితురాళ్ళకో వెళ్ళకండా నాలుగోడల మధ్యా రోజంతా కూర్చుటుందా ఏం" అన్నాడు. 'ఇదే వంత దురలవాటు?'' అన్నట్టుగా తండ్రి.

"కాకపోయినా మొగుడూ పెళ్లాం ఇద్దరికీ గొట్టెడు బియ్యం కుంపటిమీద పారేసుకుంటే, ఆపైన ఎన్నిచోట్ల కెళితే పొద్దు తిరగనూ! హాయిగా రోజూ ఏ గోదావరి కేశో షికారుపోవొచ్చుకూడా?" అంది మీగడ పెరుగు తన విస్తర్లోపోస్తున్న తల్లి. వారి ధోరణి చూస్తే లలిత అసలు విషయాలన్నీ అప్పుడే చెప్పేసినా వారేమీ అభ్యం తర పెట్టరనిపించింది గోపాలానికి. "అమ్మ వచ్చే దాకానే లలితకి కాస్తవంటైనానూ ఆపైన సంసార బాధ్యతంతా అమ్మే చూసుకుపోతుంది. లలితా తనూ జంటపావురాల్లా గాలిలో తేలిపోవొచ్చు'' అనుకున్నాడు గోపాలం

అనుకున్నప్రకారం ఓ సుభముహుర్తాన్న లలితా గోపాలాల వివాహం సక్రమంగా జరిగిపోయిందిగాని ఆ తరవాత సంభవాలన్నీ అనుకున్నదానికి వ్యతిరేకం గానే జరిగాయి.

గోపాలం పెళ్లయిన రెండుమాసాలకే తల్లికి వాత జ్వరం వొచ్చి కాళ్లూ, చేతులూ తిమ్మిర్లుపట్టి పట్లు తప్పాయి, పై అధికార్లతో మాటపట్టిపులు పెట్టుకుని గడువుకి ఏడాది ముందుగానే శెలవుపెట్టెసి కుటుంబ సహితంగా కొడుకువద్ద కొచ్చేశాడు తండ్రి. ఇక లలిత పరిస్తితి ముసుగులో గుద్దులాటగావుంది. మొదట్లో అంత సద్దుబాటు కబుర్లు చెప్పిన తల్లితండ్రులు ఇప్పుడు అడుగడుగునా లలిత నపార్ధంచేసుకుంటున్నట్టుగా గోపా లాని కనిపించి, వారియందుగల గౌరవం తగ్గుకొస్తూంది అయితే లలిత అలాక్కాదు, తను ఆ నాడు భర్తకు మాటిచ్చినప్రకారం తు. చ. తప్పకుండా అనుసరించ గలుతూంది. అందుగ్గాను శారీరకంగాని, మనసుకుగాని ఎంత శ్రమకల్గినా సహనంతో అనుభవిస్తూంది. ఎన్న డైనా మానవసహజమైన మనో దౌర్బల్యం ఏర్పడి కాస్సేపు బాధపడ్డా, వెంటనే తన్ను తనే సరిదిద్దుకుని సర్దుకుపోతూండటమేగాక అలాంటి పరిస్థితుల్లో నున్న భర్తనుకూడా సర్దుకుపోతూంది. నిజంగా లలితలో ఇంతటి నిబ్బరం వుండకపోతే అన్ని పన్లూ తన ముక్కోపితనంతో తారుమారు చేసేసివుండే వాడేమో? ఎలాగైతేనేం ఆరుమాసా లెలాగో గడిపేశాం. ఇంకొక ఆరుమాసాలు శ్రమపడితే ఇక లలిత ఇల్లు కదలఖ్ఖర్లేదు, అయితే అవి గడవడం ఎలాగ? లలిత అట్నుంచిటు తిరగడంతో గోపాలం ఆలోచన్ల కంతరాయం కల్గింది. అబ్బా? బాగా చీకటిపడిపోయిందే? దబ్బున లలిత సమీపానికి వెళ్లి 'లల్లీ' అని మెల్లగా పిల్చాడు. లలిత ఇంకా నిద్రపోతూనేవుంది. కిటికిటీ రెక్కల్ను బాగా తెరిచి నైట్‌లైటు వేసి, మెల్లిగా డాబామీది కొచ్చాడు గోపాలం. అప్పుడే విడున్తూన్న పారిజాతాల గుబాళింపు ఒక్కసారి అతన్ని ఆహ్వానించింది. మెల్లగా డాబావారకు వెళ్ళాడు.

తులసి గట్టుమీద కూర్చుని సంధ్యావందనం చేసుకుంటున్నాడు తండ్రి. ఆ సమీపాన్నే పెరటి గుమ్మం మెట్టుమీద కూర్చుని మెల్లగా ఏదో స్తోత్రాలు వల్లించుకుంటూంది తల్లి. చేతిగడియారం చూసుకున్నాడు గోపాలం టయిము ఏడున్నరా లలితవుంటే ఈపాటికి భోజనానికి పరుగులెత్తించేవాడు. ఇవాళ ఎలా వూరుకున్నాడో నాన్న? కోపంగా ఓసారి ఆయనవేపు చూసి, పైమీది తువ్వాలు పరుచుకుని అక్కడే పడుకున్నాడు ఆకాశంవేపు చూస్తూ. కిందినుంచి పారిజాతపు పరిమళంతో సహా. అరాకొరాగా అమ్మా నాన్నా. మాట్లాడుకోవడం వినిపిస్తూంది "కోడలు" అన్న పదం ఒకటికి రెండుసార్లు చెవిని పడగానే ఆదుర్దాగా లేచి శ్రద్ధగా ఆ సంభాషణ వినసాగాడు గోపాలం.

"అబ్బాయికీ విషయం తెలుసా?"

"ఏమో! నేను మేడెక్కలేనాయె. వాడు కింద నిలబడాయె. పోనీ మీరన్నా వాణ్ణి కాస్త మందలించరాదుటండీ?

"ఏమనీ?"

"ఈ సమయంలో, ఆ పిల్లలా తిరగడం, మంచిది గాదనీ! ఏదీ కాని వేళల్లో రోజూ అలా ఒక్కర్తే, తిరిగొస్తుందాయె. ఇవాళ సాయంత్రం ఇలాగయ్యేసరికి ఏగాలో దూళో నని నా ప్రాణం హడిలిపోయిందినిజంగా.

"ఆ చిన్న పిల్లలే! మనంచెప్తే, వినేందుకూ! ఇంతకూ కోరి వేడీ, వాడేదాన్నిలా తిప్పుతూంటే–

"ఆ వాడే మనబ్బాయే?

"ఆ మనబ్బాయి ప్రోత్సాహంమీదే, ఆ పిల్లరోజూ అలావెళ్తూంది. ఇదొక్కటేననుకున్నావా ఏం వాడు ఆడుతున్న నాటకం.

"ఏంమ్మాటలండీ, వాణ్ణి అలా అపార్థం చేసుకుంటే నేనొప్పనుసుమండీ. అసలేదో లోగుట్టుంది. అందుకే ఏకాస్సేపు నిదానంగా నాఎదుట వుంటే ఏమడిగేసి పోతానో అని, టకా టకా ఉన్న పనేదో చేసుకుని అవతలికి పోతుంది పాపం మాటలనకూడదు. దాని ఓర్పూ దానిపనితనం, నిజంగా మెచ్చుకోవల్సినవి సుమండీ? అయినా, ఇన్ని కబుర్లు చెప్తారు. ఇలా రోజూ ఎక్కడికెళ్తూందో కాస్త ఆచోకి తియ్యలేరూ మీరూ."

"వోసి నీవెర్రికూలా, మరి ఊరేక్క. కాళ్లు చాచుక్కూర్చున్నా ననుకున్నవా, రోజూ తిన్నగా. మహిళా సమాజంలోకే వెళ్తూంది" గోపాలం గుండెలు దడాదడా కొట్టుకున్నాయి.

"అక్కడేం చేస్తారేవిటీ?"

"అందరూ, ఆటలూ, పాటలూ. కులాసాగా కాలక్షేపం చేస్తారు, అయితే పాపం మనకోడలు –ఆ? ఎందుకులే, నాప్లాను పూర్తయినాక చెప్తాగదూ! ఇంతకూ, ఇంతకాలం, ఆ వెధవ నౌఖరీ చేసి చేసి ప్రాణం విసిగిపోయినందున, ఈ ఆర్నెల్లపాటూ కాస్త రెక్కార్చుకుందా వన్నట్టుగా, ఈ విషయాలన్నీ నన్నుగాదన్నట్టు పట్టించుకోవడం మానేశానుగాని, ఇంకా ఇలా ఉపేక్ష చేస్తానుటే?"

"ఏంచేస్తారో! పెరట్లో పళ్లెడు మల్లెపూలు పూస్తున్నాయి. మనస్తీరా, కోడలికి జడకు కుట్టించి చూద్దామంటే లేదుగదా, ఒకర్తెనూ ఇలా ఇంట్లో పడుంటాను. ఏదో చదువుకున్నా కోడలొచ్చింది. నాలుగక్షరాలేవన్నా వినిపిస్తుందని లేదుగదా! పైగా పిల్లఇంట్లో తిరిగితే చూడానికే మనసైపోతూంటే? ఆ రోజుల్లో ఊరి వాళ్లందరికీ రెక్కలు విరిగేటట్టు అన్నివిధాలా చేశాను ఈనాడు, నాకోడలంటూ నట్టింటి కొచ్చేసరికీ, ఇలా కుంటి కుంపటలే. ఎందుకూ ప్రయోజనం లేకుండా పోయాను. దేవుడూ, మనుషులూ అంతా అలాగె చేశారు. నా సరదాలు నాలోనేజీర్ణమై పోతున్నాయినేపెట్టి పుట్టిందంతే" ...ముక్కెగ బీల్చింది తల్లి.–ఇలాంటి తల్లి మనసుని, తనెలా పెడర్థంచేసుకున్నాడో?

"ఇదిగో! ఇప్పుడు కొత్త వైద్యుణ్ణి పెట్టిన ఈ వారంలోనే గుణం తెలుస్తోందా ఇంకొక్క నెల్లాళ్లలో, ఎప్పటి మనిషివై, అన్ని సరదాలూ తీర్చుకుందువుగాని, అందుకుతగ్గ ఏర్పాట్లన్నీ చేశేవుంచా!"

"సరి. ఆసంగతానక చూద్దంగాని. ముందువెళ్లి మీ చెల్లెల్ని తీసుకురండి. అన్న హితవులేక పిల్ల బొత్తిగా చిక్కిపోతుంది. ఎవరన్నా ఇంత హితవుగా చేసి పెట్టాల్సిన సమయం, ఆవిడొస్తే. ఈ అవసరాలన్నీ తీర్చి వెళ్తుంది అయినా, తగని వేవిళ్లుగా వున్నాయి పాపం. 'షాక్' తగిల్నట్టు, లేచి నిల్చున్నాడు గోపాలం. అతనికి తెలియకుండానే, అతని మొహం ఆనందంతో, వికసించింది.

"అవసరం తీరడ వేవిటే? ఈ వేవిళ్లు దాటాక బరువు రోజులూ, ఆపైనబాలింతా. ఇకనువ్వా? నీకు, నీమనవడికి సౌరక్షణ చేస్తూ, వాణ్ణొళ్లో పెట్టుకూర్చుందుకే పొద్దు చాల్దూ, ఇకనాకు వేళకింత చేసిపెట్టేందుకు మా చెల్లెలేక పోతే, ఎలా?'' అని కులాసాగా అంటున్నాడుతండ్రి ... ఆనందం పట్టలేక ఒక్క అంగలో గదిలో కొచ్చాడు గోపాలం. అప్పుడే మెలుకువచ్చిన లలిత. ఖంగారుగా లేచి వెళ్లబోయింది. దబ్బున చెయ్యి పట్టుకుని ఆపాడు

"అబ్బ. ఉండండీ, ఏదీకానివేళ. ఈ పాడునిద్ర. ఎలా పట్టిందో నాకు అప్పుడే ఏడున్న రేఃభర్త చేతిగడియారం చూస్తూ, గాభరాగా అంది. సందేహంగా తనవాచీ చెవి దగ్గరపెట్టి చూశాడు గోపాలం అది ఆగిపోయింది. అదే సమయాన్ని, తనరాక తెలిసేందుగ్గాను మెట్ల దగ్గర్నుంచే, ఓ చిన్నదగ్గుదగ్గి, అన్నీ ఒడ్డించిన కంచంతో. లోపలికొచ్చింది సుశీల. ఇదేవి టన్నట్టు కంచంవేపూ సుశీలవేపూ, తెల్లబోతూ చూసింది లలిత.

''అలా చూస్తావేం లలితా. ఇవాళ్టికిక్కడ తినెయ్యి. అన్నాడు అనురాగంతో గోపాలం''

"ఇవాల్టికి మాత్రం ఏవిటి ఇంకా రెండ్రోజుల్దాకా. ఇంతే శిక్ష నీకు" అంది నవ్వుతూ సుశీల.

"అలాగేం? ఆ తరవాతేం శిక్ష?" అంది హాశ్యంగా లలిత.

"తరవాత? నువ్వు అస్తమానం మెట్టెక్కి దిగకూడదుటగా! ఇకమీద నాగదిలోనే నువ్వుండాలి. నీమాటకేంగాని పరీక్షలు ముందుపెట్టుకుని నీకిలా అందించడం నాన్నకు రేపట్నుంచి ఏడుగంటలకే వడ్డించడం నాకూ శిక్ష. నాతాళంపడతారిద్దరూనూ వూంకానీ. ఏడున్నరయితే ఇంక క్షణమాగరు నాన్న."

"నాన్న కంత తొందరగా దేనికో, హరికథ ముందుకు దేకిందా!

"ఇక హరికథ ప్రసక్తే లేదుగా, ఆ టైములో నాన్న ప్రయివేట్లు చెప్పి నీ పెళ్లి బాకీ తీరుస్తున్నారుట. ఒదినింక ఉద్యోగం చెయ్యనవసరంలేకుండా?"

"నీకేవన్నా కలొచ్చిందేవిటే. పగటికలా?" నిర్ఘాంతపోతూ అన్నాడు గోపాలం స్తంభించిపోయింది లలిత.

"నిజమే నన్నయ్యా. నువ్వీఊర్లో ఉద్యోగంలో చేరినప్పట్నుంచీ ఇవాల్టిదాకా జరిగిందంతా నాన్న అమ్మతో చెప్తుంటే విన్నా ఇప్పుడే," లలితా గోపాలం తెల్లబోతూ ఒకరిమొహాలొకరు చూసుకుంటూంటే ఖాళీకంచం పట్టుకుని చల్లగా అవతలకి జారింది సుశీల.

"ఏదో మహా ఆలోచించి ఓ గొప్ప పథకాన్ని అతి రహశ్యంగా చాకచెక్యంగా నిర్వహించుకొస్తున్నామని మనం మురుస్తున్నాంగానీ, నిజంగా అలా చెయ్యగలిగింది మావగారు. మొన్నటి నెల సొమ్మిచ్చేందుకు నేను మావయ్యగారిదగ్గర కెళ్ళినప్పుడు! పై నెలలో ఈ అక్కౌంటు ఫైసల్ అయిపోతుందిలే అమ్మా అన్నారు. నవ్వుతూ హాశ్యాని కంటున్నారనే నిజంగా నేననుకున్నా!"

"నాన్న చాలా లోతుమనిషి ఏ విషయం దబ్బున పైకి తేలరు. ఆ సంగతి కొంతవరకూ నా కనుభవం వుందిగాని నువ్వుకూడా నావద్ద ఎన్నో దాస్తున్నావన్న విషయం ఇవాళే తెల్సుకున్నానుసుమా? "అంటూ సిగ్గుతో ఎర్రబడ్డ లలిత మొహాన్ని సున్నితంగా పైకెత్తాడు గోపాలం.

''అబ్బాయ్?'' మెట్లకిందనుంచీ తండ్రి పిలుస్తున్నాడు.

"వొస్తున్నా నాన్నా దడదడ లాడుతూన్న గుండెల్తో దబ్బునదిగి వెళ్లి తండ్రిపక్క నున్న పీటమీద తలొంచుక్కూర్చున్నాడు గోపాలం.

''ఆడే నాటక వేదో ఆడేసి బుర్రొంచుక్కూర్చుంటే అయిపోయిందేవిట్రా? వొస్తూన్న నవ్వు అణిచిపెట్టేసి, కోపంగా అన్నాడు తండ్రి.

''అదికాదు నాన్నా?''

''అది కాదేవిటి, అదికాదూ ఇదికాదూనూ, మాకు తెలియకండానే ఈ వ్యవహారం పూర్తిచెయ్యగల ననుకున్నారా?''

''పోనిద్దురూ కుర్రతనాలు. ఇద్దరూకూడ బలుక్కుని ఓ ప్లాను వేశారు గాని ఇలా అమాంతరంగా మనమంతా ఇక్కడికొచ్చి పడతామని అనుకున్నారేవిటి వాళ్ళు!'' సర్దుతూన్నట్టుగా అంది తల్లి. తను ఎంత శ్రమపడి చేసిన ఈ రహశ్యాన్ని ఎంత సునాయాసంగా తెల్సుకుని అతి సాధారణంగా చెప్పుకుంటున్నారు తన తల్లితండ్రులు?

అయిందేదో ఆయిందిగాని ఆయనదగ్గర్నుంచి ఆ నోటు వాపసుచేసేసుకో రేపువెళ్ళి. పై నెలనుంచీ ఆపిల్ల ఉద్యోగానికి రాజీనామా పెట్టించు. దైవం రక్షించి అన్ని సక్రమంగా జరిగిపోతే ఆ పైమాట చూసుకోవచ్చు. అప్పటికి మీ అమ్మకోలుకుందంటే ఇంట్లో ఇబ్బందుం

డదు గనక అంతేగాని, ఈ పరిస్థితిలో ఇంటా బయటా ఆ పిల్లలా హైరాన పడిందంటే రేపొద్దున్నా సంతానాన్ని తీర్చేందుకు ఇంతకు రెండింతలు ఖర్చుచెయ్యాడమేగాకుండా పసిపిల్లాళ్ళతో సంతోషంగా కాలక్షేపం పోయి, మందులూ డాక్టర్లూ అంటూ మనోవ్యాధి పడాల్సొస్తుంది తెలిసిందా?" గద్దించాడు తండ్రి రాబోయే మనవణ్ణి వెనకేసుకుంటూ.

"అబ్బ సరేలెండి ఏదో చిన్నతనం వాడికిమాత్రం ఇబ్బందిపడాలని మనసా ఏం? ఇంతకి మబ్బులో పొద్దులాగ ఎవరిమనసులో ఆలోచన్లు వాళ్లమనసులో వుంచేసుకోడాన్ని. ఒకరి ప్రవర్తన మరొకరికి అపార్థంగా తోచి ఇన్ని చిరాకులూ వొచ్చాయి. ఇంకా నయం మీ పుణ్యాన్న ఇప్పటికన్నా ఎదార్థం బయట తేగల్గారు అదేపదివేలు'' అంది అందర్నీ సర్దుబాటుచేస్తూ తల్లి.

చెల్లెళ్లు ముగ్గురూ కొంటెతనంగా అతనివేపు చూస్తూ లాలిపాట వర్లిస్తుంటే? తమ్ముళ్లిద్దరూ ముసిముసి నవ్వులు నవ్వుతున్నారు సావిట్లో!

కాలాతీతం

హృదయ సౌందర్యసీమల మెలిగియున్న
ముద్దుగులాబీ నేడు చివురుతొడిగి

ముద్దుమొగ మెత్తి నవ్వేగ మొగ్గనుండి
వెయిజలతారు రేకలు విప్పుకొనుచు

వలపు తేనియ పొంగులు గిలుకరించి
హృదయ పాత్రికబూని రోజాకుమారి

వేచియున్నది చివురుల నీడలందు
అళికుమారునకదె సుస్వాగతమును పలికె.

చండభానుని కిరణాల చాలబడలి
మరగిపోయెను నీహారమాలలెల్ల

వాడిపోయిన సుమబాల నేలకొరిగి
పవ్వళించెను గాలిపొత్తిళ్ళలోన

అపుడు ఏతెంచె దూరతీరాలనుండి
పొంగి ఝుంకార శృంగార భృంగరాజు

వాడిపోయిన సుమమేమి స్వాగతించు
వేడి కన్నీటి ముత్యాలె విరులుగాక.

క్షణికమైనట్టి ఈ జీవితమ్ములోన
జారిపోయిన సుఖములు ఏరగలమె?

శ్రీమతి. యస్. యస్. ప్రసూన

చె కో స్లో వా కి యా లో

మహిళల సంఘాల సాంస్కృతిక సేవ

చెకోస్లావాకియాలో ప్రతి గ్రామంలోనూ మహిళా సంఘాలున్నాయి. అవి స్థానిక జాతీయ కమిటీలకు చాల తోడ్పడుతూ వుంటాయి. స్థానిక జాతీయ కమిటీలు యీ మహిళా సంఘాలకువివిధ రకాల బాధ్యతలప్ప గిస్తాయి; అయినప్పటికీ మహిళా సంఘాలు అనేక ప్రతి పాదనలు; డిమాండ్ చేస్తూ చాల చొరవతీసుకుని పని చేస్తాయి. ఆయా ప్రాంతాల స్త్రీలకు సబంధించిన సమ స్యలను పరిష్కరించడానికి పాటుబడతాయి,


మహిళా సంఘాల కృషివల్ల పల్లెలలోనూ, పట్టణాల లోనూ వస్తువులమ్మే కేంద్రాలు నెలకొల్పబడ్డాయి. ప్రజలకు సౌకర్యాలు కలుగజేయడానికి కృషిచేస్తున్నాయి కొత్త శిశు పోషణాలయాలు, కిండర్‌గార్డెన్‌లు మొదలైనవి గ్రామాలలో నెలకొల్పబడుతున్నాయి; అంతే కాకుండా ఎంత చిన్న గ్రామానికైనా డాక్టరు కనీసం వారానికొకసారైనా వచ్చేటట్టు చేయడానికి ఆరోగ్య కేంద్రాలో లేక ప్రథమ చికిత్సా కేంద్రాలో నెలకొల్పడం జరుగుతూంది. పెద్ద గ్రామాలలోనూ, చిన్న పట్టణాల లోనూ బాలల, మహిళల వైద్యకేంద్రాల సంఖ్య ఎక్కువవుతున్నది. మహిళా సంఘాలు పాఠశాలల్లోని భోజన శాలలనూ, తల్లితండ్రులు పనులలోకి వెళ్లినప్పుడు పిల్లలనుంచి, చదువుచెప్పే కేంద్రాలనూ నిర్వహిస్తున్నాయి. యువ కార్మికులకోసమై హాస్టల్సు, బోర్డింగు సంస్థలు నిర్వహిస్తున్నాయి.

అయితే స్త్రీల విద్య మహిళా సంఘాల ప్రధాన లక్ష్యాలలో ఒకటి. మహిళలు తల్లులుగా, దేశ నిర్మాతలుగా తమ బాధ్యతను గుర్తించేటట్టు అవసరము అవుతూంది. ఈ సందర్భంలో విద్యాకృషి అంటే, స్త్రీల సమానత్వాన్ని, హక్కులనూ సరిగ్గా వినియోగించేటట్టు, సమాజంపట్ల తమ బాధ్యతను నిర్వర్తించేటట్టు మహిళలకు బోధించడమన్నమాట. మహిళా సంఘాలు స్థానిక సాంస్కృతిక కేంద్రాలలో చురుగ్గా పనిచేస్తాయి. పురుషులతో కలిసి అవి యీ కేంద్రాలను నిర్వహిస్తాయి,

మహిళా సంఘాలు, సాంస్కృతిక భవనాలలో స్త్రీలకై కుట్టుపని, అల్లికలు మొదలైన క్లాసులు నడుపుతాయి, చెకోస్లోవాకియాలో కుట్టుపని క్లాసులలో విద్యార్థులు చాల ఎక్కువ. ప్రాంతీయ సాంస్కృతిక భవనాలే యీ క్లాసులకు అవసరమైన సామగ్రినీ. శిక్షణయిచ్చేవాళ్లనూ సమకూర్చడమూ, వాటిని నిర్వహించడమూ చేస్తాయి! అయితే చాలా ప్రాంతాలలో మహిళా సంఘాలే వాటిని నడుపుతాయి, ఈ కోర్సులు పూర్తిఅయినప్పుడల్లా విద్యార్థులు కుట్టినటువంటీ. అల్లినటువంటీ వస్తువుల ప్రదర్శనంగాని, ఫ్యాషన్ల ప్రదర్శనంగాని ఏర్పాటవుతుంది. ఈ క్లాసుల్లో మహిళలు కుట్టుపని నేర్చుకోవడమే కాకుండా మంచి అభిరుచులనుకూడా అలవర్చుకుంటారు. వివిధ వయసులవారికే, వివిధ సమయాలకూ సరిపడే ఫ్యాషన్లను ఎంచుకోవడానికీ క్లాసులు తోడ్పడతాయి, ఈ క్లాసులలో కేవలం కుట్టుపనేకాకుండా వివిధ విషయాలపై చర్చలుకూడా జరుగుతాయి; పొదుపుగా సంసారం చేసుకోవడం, పిల్లల చదువులు. మొదలైన విషయాల గూర్చి చర్చలు జరుగుతాయి. మంచి గ్రంథాలు చదివి, వాటిలోని విషయాలను చర్చించడంకూడా చేస్తారు.

వంటపనిలోనూ, ముఖ్యంగా గ్రామాలలో పళ్లూ, కాయగూరలు, మాంసం నిలవచెయ్యడం గురించీ శిక్షణ తరగతులుకూడా వుంటాయి; ఇది అనుభవంలేని యువతులైన గృహిణులకు చాల ఉపయోగకరం. వంట పని శిక్షణ అంటే కేవలం రుచికరమైన వంటలు

సో నా కో జె ల్ కో వా




చిల్డ్రన్స్ గార్డెన్ స్కూలు వ్యవస్థాపకులు శ్రీ శర్మా దంపతులు వారి కుమార్తె శకుంతలా శర్మ. (ప్రస్తుతపు హెడ్ మిస్ట్రెస్.)

వండడం మాత్రమే కాకుండా తక్కువ ఖర్చుతో మంచి ఆరోగ్యకరమైన వంటలనుకూడా వండడం నేర్చుకోవడమన్నమాట.

మొత్తంమీద చెకోస్లొవాక్ మహిళలు పారిశుధ్య, పొదుపరితనం బాగా తెలుసుకుని చక్కగా సంసారం చేసుకుంటారు. ఇప్పుడు చాలవరకు పట్టణాలలోనూ, పారిశ్రామిక వాడలలోనూ స్థిర నివాసం ఏర్పరచుకున్న జిప్సీ (సంచారజాతుల) కుటుంబాలలోని స్త్రీలకు మహిళా సంఘాలు పారిశుధ్యంగురించీ, పొదుపుగా, సంసారం దిద్దుకోవడం గురించీ బోధిస్తాయి. చాల నగరాలలో జిప్సీ కుటుంబాలకు యిలాంటి శిక్షణ యివ్వడమయింది. ఇప్పుడు జిప్సీలు చాలవరకు మామూలు నాగరిక జీవితాన్ని గడుపుతున్నారు. ఇందువల్ల, కొంతవరకు జిప్సీలపట్ల వుండిన దురభిప్రాయంకూడా తొలగిపోతూంది.

పల్లెలలోనూ, పట్టణాలలోనూ మహిళా సంఘాలు, సాంస్కృతిక భవనాలవారి సహాయంతో. ప్రధానంగా వైద్య, విద్యాబోధన విషయాలగురించి సమావేశాలు, ఉపన్యాసాలు ఏర్పాటు చేస్తాయి. ఒకప్పుడు మహిళలకు వివిధరకాల టీకాలపట్ల, రోగనిరోధక చర్యలపట్ల, స్త్రీ రోగనిరోధక పరీక్షలపట్ల వుండిన దురభిప్రాయాలు అవిశ్వాసమూ యీ కార్యకలాపాల కారణంగా తొలగిపోయాయి. ఇందువల్ల అంటు వ్యాధుల నివారణా కృషి కూడా సులభమయింది.

ఇటీవలి సంవత్సరాలలో పిల్లల చదువు గురించి జరిగే ఉపన్యాసలపట్ల, చర్చలపట్ల స్త్రీలకు శ్రద్ధ ఎక్కువైంది. తల్లిదండ్రులు తమ పిల్లలకు బాగా చదువురావాలని కోరుతుంటారు. ముఖ్యంగా నవయువ్వనంలో ప్రవేశించే బాలలకు విద్యాబుద్ధులు నేర్పడం చాలకష్టమైనదని మహిళా సంఘాల కృషివల్ల పౌరులు తమ పిల్లల చదువును గురించి ఎక్కువగా శ్రద్ధాసక్తులు చూపడం జరుగుతున్నది.



Printed and Published by N. R. Chendur, at Andhra Mahila Press, 7 A Rosary Church Road
Santhome, Madras-4. Hony. Editor: Mrs. Malati Chendur.